JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 05-02-2026
Medchal - Malkajgiri । Thursday 05-02-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 250
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 250 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me
jayabheripaper@gmail.com




# రైతు భరోసా నిధుల విడుదల అప్పుడే..

- అన్నదాతలకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్‌న్యూస్
- అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడంతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్
- తెలంగాణలో 3.17 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ రైతులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రైతు భరోసా నిధుల విడుదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే రైతుల అకౌంట్లలో డబ్బులు వేయనున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే మిర్యాలగూడ మండలం గూడూరులో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవ సభలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటనలు చేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలకు శంకుస్థాపన చేసిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఓటు వేసి సరైన తీర్పు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ పథకాల్లో పార్టీలతో సంబంధం లేకుండా.. ఎలాంటి వివక్ష లేకుండా అందరికీ ఇస్తున్నట్లు వెల్లడించారు. రైతులకు పంటల రుణాల మాఫీ పథకం కింద రూ.21 వేల కోట్లను అందించినట్లు తెలిపారు. దీంతో 25.35 లక్షల మంది రైతులకు అండగా నిలిచినట్లు పేర్కొన్నారు. అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వడంతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ కూడా ఇస్తున్నట్లు వివరించారు. రైతు భరోసా పథకం కింద రూ.6 వేల చొప్పున ఇప్పటివరకు రూ.9 వేల కోట్లు అర్హులైన రైతుల ఖాతాల్లో వేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు ముగిసిన తర్వాత రైతు భరోసా నిధులు జమ చేస్తామని పేర్కొన్నారు.

...మిగతాది 2 లో

*మిర్యాలగూడలో రూ. 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రగతి బాట' కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా నీలగిరి జిల్లా మహిళా సమాఖ్యకు రూ. 1138 కోట్ల చెక్కును అందజేశారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నబియ్యం పంపిణీ, బోనస్, ఉచిత విద్యుత్ పథకాల గురించి ప్రస్తావిస్తూ, దేశంలోనే రైతుల సంక్షేమానికి అత్యధికంగా ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వమని పేర్కొన్నారు.*

# ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ ఆందోళన

- ఆ రంగాలకు ప్రయోజనం : పీయూష్



**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 :**

పార్లమెంట్ సమావేశాల వేళ భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అంశం రాజకీయ దుమారం రేపుతోంది. రెండు సభలను కుదిపేస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి మేరకు ఈ ఒప్పందం తక్షణమే అమల్లోకి వస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించి 36 గంటలు దాటినా, ఇప్పటి వరకు డీల్పై పూర్తి వివరాలతో కూడిన సంయుక్త ప్రకటన వెలువడలేదని పేర్కొంది. వాణిజ్య ఒప్పందం గురించి స్పష్టత ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ పలు ప్రశ్నలను సంధించింది."భారత ప్రధాని మోదీ అభ్యర్థన మేరకు ఇండియా యూఎస్ వాణిజ్య ఒప్పందం కుదిరిందని, ఇది తక్షణమే అమల్లోకి వస్తోందని ట్రంప్ ప్రకటించి 36 గంటలు అవుతోంది. అమెరికా ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులపై టారిఫ్‌లను భారత్ తగ్గించిందని తెలుస్తోంది.

...మిగతాది 2 లో

# రాహుల్ ని మాట్లాడనివ్వరా..

- అక్కడ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే అభ్యంతరం ఏంటని ప్రియాంక గాంధీ
- పార్లమెంట్‌లో ఎవరికీ ఇష్టానుసారంగా మాట్లాడే హక్కు లేదు!



**జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4 :**

పార్లమెంట్ సమావేశాల వేళ అధికార పక్షం తీరుపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశాల సమయంలో ప్రతిపక్షాల గొంతు నొక్కడం ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం భయపడుతుంది కాబట్టే ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని సభలో మాట్లాడనివ్వడం లేదన్నారు. పార్లమెంటు అనేది ప్రజాస్వామ్య దేవాలయమని, అక్కడ తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే అభ్యంతరం ఏంటని ఆమె ప్రశ్నించారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆమె మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా పార్లమెంట్ ఎంపీల సస్పెన్షన్ గురించి కూడా ప్రియాంక ప్రస్తావించారు. 'కొత్తగా ఏం జరిగింది? ఈ విధంగా జరగడం ప్రతి సమావేశంలోనూ మీరు చూస్తున్నారు. ఈ సమస్య కేవలం ప్రతిపక్ష నాయకులను మాట్లాడనివ్వకపోడం మాత్రమే కాదు. ఇది దేశ ప్రజాస్వామ్యానికి సంబంధించిన ప్రాథమిక సమస్య. పార్లమెంట్ ఒక దేవాలయం. ఇక్కడ ఎవరైనా తమ అభిప్రాయాలను వ్యక్తపరచవచ్చు" అని ప్రియాంక పేర్కొన్నారు. మరోవైపు, మాజీ ఆర్మీ చీఫ్ ఎం ఎం నరవణే

...మిగతాది 2 లో

# సంజయ్ పార్టీ మారలేదు



- అనర్హత పిటీషన్ కొట్టేసిన స్పీకర్
- న్యాయబద్ధంగా జరగలేదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 4 :**

తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచానని, ఇప్పటికీ అదే పార్టీకి చెందిన ఎమ్మెల్యేనని జగిత్యాల శాసన సభ్యుడు సంజయ్ కుమార్ అన్నారు. తన జీతం నుండి నెలకు రూ.5 వేలు బీఆర్ఎస్ పార్టీకి కట్ అయ్యాయని వెల్లడించారు. తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అఫిడవిట్ కూడా ఇచ్చానని తెలిపారు. జగిత్యాల అభివృద్ధి కోసం తాను ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నానని స్పష్టం చేశారు. జగిత్యాల అభివృద్ధి కోసం తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశానని, ఆ సమయంలో ఆయన శాలువా కప్పారని అన్నారు. తాను ప్రత్యేకంగా

...మిగతాది 2 లో



3 లో

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైంది

ప్రజల సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల కలం గళంగా పనిచేస్తుంది
జయభేరి ప్రింట్ మీడియా జర్నలిస్టు బన్నె శ్రీకృష్ణ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఉమ్మడి మహబూబ్ నగర్ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి

# కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి

- ప్రజలారా.. ఓట్ల కోసం వచ్చే ఫిరాయింపు ఎమ్మెల్యేలను నిలదీయండి. వాళ్లు ఏ పార్టీలో ఉన్నారు.. ఎందుకు ఓటు వేయాలో అని అడగండి.. మండిపడ్డ బండి సంజయ్

**జయభేరి, సిరిసిల్ల, ఫిబ్రవరి 4 :**

రాష్ట్ర ప్రభుత్వంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి అంటూ మండిపడ్డారు. గాంధీ భవన్‌లో పార్టీ ఫిరాయింపుల సంసారం పెట్టారని.. అది కనిపించడం లేదా అని స్పీకర్‌ను సంజయ్ ప్రశ్నించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు గుప్పించారు. ప్రచారంలో బండి సంజయ్ మాట్లాడుతూ.. గాంధీ భవన్‌కు ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎందుకు వెళ్తున్నారని.. జిల్లా కాంగ్రెస్ ఆఫీసు మీటింగుల్లో.. వాళ్లే బీఫాంలు పంచుతున్నారని అన్నారు.



2 లో

## అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

2 లో

మొదటిపేజీ తరువాయి

## రైతు భరోసా నిధులు అప్పుడే..

భారతదేశంలో అత్యధికంగా రైతుల కోసం రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. అదే సమయంలో రాష్ట్రంలో గతంలో రేషన్ కార్డుల కోసం 10 ఏళ్ల పాటు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేదని.. కానీ ఇప్పుడు మాత్రం అప్లై చేయగానే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు తెలంగాణలో 3.17 కోట్ల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు 6 కిలోల చొప్పున సన్న బియ్యం ఇస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

సన్న బియ్యం అందుకుంటున్న వారు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని రేవంత్ రెడ్డి కోరారు. వరి పంట ఉత్పత్తిలో ఆసియాలోనే మిర్యాలగూడ ముందుందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని.. ఎన్నికల్లో హస్తం పార్టీకి ఎదురే లేదని.. తమ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని తేల్చి చెప్పారు.

మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన బీఫాం మీద పోటీ చేస్తున్న మహిళలకు కూడా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. మరోవైపు.. ఏప్రిల్‌లో ప్రవేశపెట్టే తెలంగాణ బడ్జెట్‌లో పేదలు ఇళ్లు కట్టుకునేందుకు లక్షలాది మందిని ఎంపిక చేస్తామని వెల్లడించారు. గతంలో నల్గొండ జిల్లాపై ఉన్న కోపంతో ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును పక్కనపెట్టారని.. ఆ ప్రాజెక్టు ఆగిపోతే మామ, అల్లుళ్లు ధావత్ చేసుకున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కారణంగానే నల్గొండ ప్రజలు ఫ్లోరైడ్ నీళ్లు తాగాల్సిన పరిస్థితి నెలకొంది. ఎస్ఎల్‌బీసీని రెండేళ్లలో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు చేపట్టినట్లు వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ కోసం కేసీఆర్‌కు పోలీసులు నోటీసు ఇస్తే.. మొత్తం తెలంగాణ జాతికి ఇచ్చినట్లు చెబుతున్నారని సీఎం విమర్శలు గుప్పించారు.

## ట్రేడ్ డీల్‌పై కాంగ్రెస్ ఆందోళన

అయితే ఈ డీల్‌పై ఇంకా ఎటువంటి స్పష్టత లేదు. కనీసం ఉమ్మడి ప్రకటన కూడా లేదు. "అని కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. మరోవైపు, భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై కాంగ్రెస్ సీనియర్ నేత మనీశ్ తివారీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ డీల్‌పై కేంద్రానికి పలు ప్రశ్నలను సంధించారు. ఈ ఒప్పందం గురించి వాషింగ్టన్ పేర్కొన్న అంకెలు సరిపోలడం లేదని, ఈ డీల్ పరిధి, పర్యవసానాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన వివరణ ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మనీశ్ తివారీ ఎక్స్‌లో పోస్టు చేశారు ."ఇండోఅమెరికా వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్, వైట్హౌస్ చేసిన సోషల్ మీడియా పోస్ట్‌లోని లెక్కలు అస్సలు సరిపోలడం లేదు. 500 బిలియన్ డాలర్లు వాణిజ్యం జరిగిందని వైట్ హౌస్, ట్రంప్ పోస్ట్ చేశారు. ఆ అంకె ఎక్కడి నుంచి వచ్చింది? 2024లో అమెరికాకు భారత్ చేసిన ఎగుమతులు 79.44 బిలియన్ డాలర్లు.

అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు 38.99 బిలియన్ డాలర్లు. ప్రస్తుత ఎగుమతిదిగుమతి డేటా ఇటువంటి అంచనాలకు అనుగుణంగా లేదు. యూఎస్ నుంచి ఎక్కువ దిగుమతులను చేసుకోవడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందా? లేదా? అనే దానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. సుమారు 39 బిలియన్ డాలర్ల నుంచి దిగుమతులు 500 బిలియన్ డాలర్లకు చేరడం అనేది చాలా పెద్ద ప్రయాణం. 2025 ఏప్రిల్‌డిసెంబర్ మధ్య భారత్ మొత్తం దిగుమతులు 730.84 బిలియన్ డాలర్లు. అంటే మన దిగుమతులలో ముప్పావు వంతును (75 శాతం) ఒకే దేశం (అమెరికా) నుంచి తెచ్చుకోవడానికి భారత్ సిద్ధంగా ఉందా? ఈ విషయంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి" అని మనీశ్ తివారీ పేర్కొన్నారు.

భారత్ అమెరికా మధ్య కుదిరిన ఒప్పందంపై కాంగ్రెస్ సహా విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ డీల్ వల్ల దేశంలోని రైతులు, పాడి, దేశీయ పరిశ్రమలపై పడే ప్రభావం గురించి ప్రశ్నించాయి. దేశంలోని రైతులు, పాడి పరిశ్రమకు అండగా ఉండాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాయి. భారత ఎగుమతులపై 25 శాతం నుంచి 18 శాతానికి సుంకాలు తగ్గింపుపై స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అమెరికాకు చెందిన కొన్ని వస్తువులపై భారత్ సుంకాలు సున్నాకి తగ్గించిందని ట్రంప్ చేసిన ప్రకటనపైనా కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో తాజాగా భారత్‌అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం వివరాలపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేసింది.

**ఆ రంగాలకు ప్రయోజనం : పీయూశ్**

ఈ ట్రేడ్ డీల్ గురించి మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూశ్ గోయల్ కీలక విషయాలు పంచుకున్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ రంగాల ప్రయోజనాలకు ఎలాంటి రాజీ లేకుండా అమెరికాతో భారత్ అత్యుత్తమ వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకుందని స్పష్టం చేశారు.

ప్రస్తుతం వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉందని, డీల్ పూర్తి స్వరూపంపై త్వరలోనే భారత్‌అమెరికా సంయుక్త ప్రకటన చేస్తాయని తెలిపారు. అమెరికాతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని ప్రధాని మోదీ సోమవారం కుదుర్చుకున్నారని వెల్లడించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో భారత్‌కు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అభిప్రాయపడ్డారు. అమెరికాభారత్‌ల మధ్య ఇటీవల ట్రేడ్ డీల్ కుదిరింది. దీంతో ఇకపై భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ క్రమంలో ఈ డీల్‌ను భారతదేశ వృద్ధి పథాన్ని వేగవంతం చేసే మైలురాయిగా కేంద్రం అభివర్ణించింది.

## రాహుల్ ని మాట్లాడనివ్వరా..

రాసిన పుస్తకం గురించి కూడా ఆమె మాట్లాడారు. అందులో జాతీయ భద్రతా సవాళ్లకు సంబంధించిన కీలక అంశాలు ఉన్నాయని ఆరోపించారు. 'నాకు తెలిసినంత వరకు ఆ పుస్తకంలో, చైనా దళాలు మన దేశంపై దాడి చేసినప్పుడు మన అగ్రనాయకత్వం ఎలా స్పందించిందో తెలియజెప్పే అంశాలు అందులో ఉన్నాయి' అని ప్రియాంక పేర్కొన్నారు. ఎప్స్టీన్ ఫైల్స్ గురించి కూడా ప్రియాంక ప్రశ్నలను లెవనెత్తారు. ఈ విషయం గురించి పార్లమెంట్లో కాకుండా మరెక్కడ ప్రస్తావించాలని ప్రియాంక ప్రశ్నించారు. ఈ విషయంపై రాహుల్ గాంధీని సమర్థిస్తూ ఆమె ప్రియాంక మాట్లాడారు. రాహుల్గాంధీ పార్లమెంట్లో మాట్లాడకుండా ఆయన్ను లక్ష్యంగా చేసుకున్నారని విమర్శించారు.

**పార్లమెంట్‌లో ఎవరికీ ఇష్టానుసారంగా మాట్లాడే హక్కు లేదు!**

ఇదిలా ఉండగా, రాహుల్గాంధీని ఉద్దేశించి పార్లమెంట్ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభలో మాట్లాడేటప్పుడు రాహుల్ గాంధీ తప్పనిసరిగా సభా నియమాలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఎవరికీ ఇష్టానుసారంగా మాట్లాడే హక్కు లేదని ఆయన తేల్చిచెప్పారు.

లోక్‌సభలో మాట్లాడటానికి అనుమతించలేదని రాహుల్ గాంధీ రాసిన లేఖపై మంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ, తాను ఆ లేఖకు సమాధానం ఇచ్చినట్లు తెలిపారు."మేం రెండు రోజులపాటు వేచి చూసి చూసి విసిగిపోయాం. కానీ ఆయన మాట్లాడటం లేదు.

సభా నియమాలకు అతీతంగా మాట్లాడతానంటున్నారు. సభలో ఇతర సభ్యులకూ మాట్లాడే అవకాశం ఇవ్వాలి. ఇది భారత పార్లమెంట్. ఇక్కడ ప్రతి ఒక్కరూ నియమాల ప్రకారమే మాట్లాడాలి. ఎవరూ ఇష్టానుసారంగా ప్రసంగించటానికి వీల్లేదు." అని వ్యాఖ్యానించారు.

**లోక్‌సభలో మాట్లాడటం ప్రతి ఎంపీకి ఉన్న హక్కు!**

మరోవైపు, ఈ విషయంపై కాంగ్రెస్ పార్టీ నుంచి తీవ్ర ప్రతిస్పందన వచ్చింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ఉజ్వల్ రమణ్ సింగ్ మాట్లాడారు. లోక్‌సభలో మాట్లాడటం ప్రతిపక్ష నేతకే కాకుడా ప్రతి ఎంపీకి హక్కేనని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ గొంతును నొక్కేయాలనే ఉద్దేశంతోనే బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు."లోక్‌సభ ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీకి మాట్లాడే హక్కు ఉంది. ఆయన మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రతిసారీ బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోంది. గతంలోనూ ఎంపీలను సస్పెండ్ చేసి సభ నడిపిన చరిత్ర బీజేపీది. ప్రతిపక్షం లేని సభను నడపాలనుకుంటే నడపండి. కానీ ప్రతిపక్ష గొంతును నొక్కాలనుకుంటే మేమెప్పుడూ సహించం" అని ఉజ్వల్ రమణ్ సింగ్ పేర్కొన్నారు.

# అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ పైచేయి

> భారత ఆర్థిక వ్యవస్థ అంతర్జాతీయ స్థాయిలో ఒక నూతన శకాన్ని ఆరంభించింది. ప్రపంచవ్యాప్తంగా అగ్రగామి దేశాలతో వరుసగా కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలతో భారత్ తన ఆర్థిక వ్యూహాన్ని పూర్తిగా మార్చేస్తోంది. ముఖ్యంగా అమెరికాతో కుదిరిన తాజా చారిత్రక వాణిజ్య ఒప్పందం భారత్ ఆర్థిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.



ప్రపంచ స్థూల దేశీయ ఉత్పత్తిలో సగానికి పైగా వాటా కలిగిన దేశాలతో భారత్ ప్రస్తుతం వాణిజ్య బంధాలను కలిగి ఉండటం ఇక్కడ గుర్తించాల్సిన విషయం. కేవలం కొన్ని రోజుల వ్యవధిలోనే రెండు కీలకమైన అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడం ద్వారా దేశం తన వ్యూహాత్మక దౌత్యాన్ని అనుసరిస్తోంది.భారత్, అమెరికా మధ్య ట్రేడ్ డీల్ కు అంగీకారం జరిగిన తరువాత రష్యా చమురు కొనుగోలు హాట్ టాపిక్ అవుతోంది. అయితే రష్యా ముడి చమురును కొనడం పూర్తిగా ఆపివేయడం వల్ల ఇండియాకు సమస్యలు ఏర్పడవచ్చు. రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఫిబ్రవరి 3 తన నివేదికలో, భారత్ ఇటీవల నెలల్లో రష్యా నుండి ముడి చమురును కొనడం క్రమంగా తగ్గించిందని పేర్కొంది. అందుకు అమెరికానే కారణం అని తెలిసిందే. అయితే పూర్తి కొనుగోళ్లను ఒక్కసారిగా నిలిపివేస్తే ఆర్థికాభివృద్ధికి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇది దేశంలో సరఫరా లోటుకు కారణంగా మారవచ్చు. చమురు ధరలు పెరిగి ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపవచ్చు అని కొందరు నిపుణులు అంచనా వేశారు. ఎందుకంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటి.అమెరికాతో డీల్ కోసం భారత్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుంది. రష్యా నుంచి కాకుండా ఇతర దేశాల నుంచి చౌక ధరకు ముడి చమురు కొనడం సవాల్‌గా మారనుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ధరల పెరుగుదలకు కారణం అవుతుందని, భారత్ వంటి అతిపెద్ద దిగుమతి చేసుకునే దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని మూడీస్ స్పష్టంగా పేర్కొంది.

ఆర్థికాభివృద్ధిలో ఇబ్బందులను నివారించడానికి భారతదేశం వెంటనే అన్ని రష్యా నుంచి ముడి చమురు కొనుగోళ్లను ఆపివేసే అవకాశం లేదని ఏజెన్సీ తెలిపింది.అమెరికా భారత వస్తువులపై టారిఫ్ 50 శాతం నుండి 18 శాతానికి తగ్గించిన వాణిజ్య ఒప్పందం కోసం వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత్ త్వరలో రష్యా చమురును కొనడం ఆపివేస్తుందన్నారు. ఇకనుంచి వెనిజులా నుండి ఎక్కువ చమురును కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. భారత్ అమెరికా నుండి 500 బిలియన్ డాలర్లకు పైగా ఉత్పత్తులను కొనుగోలు చేస్తుందని, ఇందులో ముడి చమురు కూడా ఉంటుందని ట్రంప్ అన్నారు. అయితే, ప్రధాని మోదీ మాత్రం టారిఫ్ తగ్గించడంపై మాత్రమే మాట్లాడారు. కానీ రష్యా చమురును ఆపివేయడం గురించి స్పష్టత ఇవ్వలేదు. రష్యా చమురు కొనుగోలు కారణంగా విధించిన అదనపు 25 శాతం పెనాల్టీ సుంకాన్ని తొలగించారని, అలాంటి కొనుగోళ్లను ఆపివేయడానికి భారత్ అంగీకరించిందని వైట్ హౌస్ అధికారి పేర్కొన్నారు. అయితే, మూడీస్ విశ్లేషణ ప్రకారం, భారత్ ఈ మార్పును నెమ్మదిగా అమలు చేస్తుంది, ఎందుకంటే తక్షణ మార్పు భారత్ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది.ఈ ఒప్పందం ఆభరణాలు, రత్నాలు, టెక్స్‌టైల్ వంటి రంగాలలో భారత ఎగుమతులకు ప్రయోజనం చేకూరుస్తుంది, ఎందుకంటే అమెరికా భారత్‌కు అతిపెద్ద ఎగుమతి మార్కెట్. డీల్ ప్రకటన తర్వాత, స్టాక్ మార్కెట్లో జోరు కనిపించింది. నిఫ్టీ దాదాపు 3 శాతం పెరగగా, రూపాయి బలపడి డాలర్‌కు 90.40 వద్దకు చేరుకుంది.భారత్ వాణిజ్య శాఖ గడిచిన 12 నెలల్లో అత్యంత చురుగ్గా వ్యవహరించింది.

అమెరికాతో కుదిరిన తాజా ఒప్పందానికి కొద్ది రోజుల ముందే భారత్, యూరోపియన్ యూనియన్‌తో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసింది. ఒకే సంవత్సరంలో ప్రపంచంలోని రెండు అతి పెద్ద ఆర్థిక శక్తులతో కుదుర్చుకోవడం భారత ఆర్థిక చరిత్రలో ఇదే తొలిసారి. వీటితోపాటు బ్రిటన్, ఓమన్, న్యూజిలాండ్‌తో కూడా భారత్ వాణిజ్య ఒప్పందాలను పూర్తి చేసుకుంది. ఈ ఐదు దేశాలు సహా భారత్‌కు చెందిన మొత్తం జీడీపీని లెక్కిస్తే అది ప్రపంచ మొత్తం జీడీపీలో సుమారు 50 నుంచి 55 శాతం వరకు ఉంటుంది. కేవలం భారత్, యూరోపియన్ యూనియన్ వాటానే ప్రపంచ జీడీపీలో 25 శాతంగా ఉంది. గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్‌లో భారత్ ఎదుగుతున్న శక్తిని స్పష్టం చేస్తున్నాయి. ఈ ఒప్పందం భారత్‌కు పొరుగు దేశాలైన బంగ్లాదేశ్ వియత్నాం, థాయ్‌లాండ్‌లతో పోలిస్తే గొప్ప పోటీతత్వాన్ని కల్పించనుంది. ప్రస్తుతం అమెరికా విధించిన కొత్త నిబంధనల ప్రకారం... బంగ్లాదేశ్‌పై 20 శాతం, వియత్నాం 20 శాతం, థాయిలాండ్‌పై 19 శాతం టారిఫ్‌లు ఉన్నాయి.

కానీ భారత్‌కు ఇది కేవలం 18 శాతానికి తగ్గడం వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ వస్తువుల ధరలు తగ్గి గిరాకీ పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అమెరికా ప్రథమ స్థానంలో ఉండగా, యూరోపియన్ యూనియన్ ద్వితీయ స్థానంలో ఉంది. భారత్ ఇప్పటికే ప్రపంచంలో నాల్గో అతి పెద్ద ఆర్థికవ్యవస్థగా ఉంది. బ్రిటన్ కూడా టాప్ 5 ఆర్థిక వ్యవస్థల జాబితాలో కొనసాగుతోంది. ఈ ప్రభావవంతమైన ఆర్థిక శక్తులన్నీ ఇప్పుడు భారత్‌తో దృఢమైన వాణిజ్య బంధాన్ని కలిగి ఉన్నాయి. ప్రపంచ మొత్తం వాణిజ్యంలో ఈ కూటమి వాటా 38 నుంచి 40 శాతం వరకు ఉన్నట్టు లెక్కలు చూస్తున్నాయి. ఇవే కాకుండా, భారత్ ఇప్పటికే జపాన్, దక్షిణ కొరియా, ఆసియాన్ దేశాలు, సార్క్ దేశాలు, మారిషస్, యూఏఈ, ఆస్ట్రేలియా వంటి దేశాలతో ప్రాంతీయ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కలిగి ఉంది. తాజా ఒప్పందాలతో భారత తయారీ రంగం సేవా రంగానికి అంతర్జాతీయ మార్కెట్లు భారీగా అందుబాటులోకి రానున్నాయి. భారత్ తన వాణిజ్య విధానాల్లో చూపిస్తున్న ఈ దూకుడు ప్రపంచ దేశాలను ఆశ్చర్యానికి గురి చేస్తోంది. చైనా వంటి దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని చూస్తున్న పాశ్చాత్య దేశాలకు భారత్ ఇప్పుడు ఒక నమ్మకమైన, బలమైన ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. సుంకాల తగ్గింపు వ్యూహాత్మక భాగస్వామ్యాలు, స్థిరమైన ఆర్థిక వృద్ధి భారత్‌ను త్వరలోనే 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా నడిపిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదని నిపుణులు అంటున్నారు.

## సంజయ్ పార్టీ మారలేదు

కాంగ్రెస్ పార్టీలో చేరడానికి వెళ్లలేదని అన్నారు. కలిసి పని చేస్తామని చెప్పాం తప్ప పార్టీలో చేరినట్లు ఎక్కడా పేర్కొనలేదని అన్నారు. కానీ ఆధారాలు లేకుండా మీడియా అసత్య ప్రచారం చేసిందని అన్నారు. తాను కాంగ్రెస్ పార్టీలో చేరానని భావించి బీఆర్ఎస్ వాళ్లు తన ఆసుపత్రి వద్ద రచ్చరచ్చ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వివరణ ఇవ్వడానికి తనకు కనీసం అవకాశం ఇవ్వలేదని, నోటీసు కూడా ఇవ్వలేదని అన్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా ఇదే విషయం అడిగారని అన్నారు. తన ఖాతా నుంచి గత మార్చి వరకు బీఆర్ఎస్ పార్టీకి డబ్బులు కట్ అయ్యాయని అన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ స్వయంగా దానిని ఆపేసిందని అన్నారు. కాగా, సంజయ్ పార్టీ మారారని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేసిన పిటిషన్‌ను స్పీకర్ ప్రసాద్ కుమార్ కొట్టివేశారు. సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు చూపించలేక పోయారని ఈ సందర్భంగా స్పీకర్ పేర్కొన్నారు. మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై బీఆర్ఎస్ పిటిషన్లు దాఖలు చేయగా, ఈరోజు వరకు 8 మంది ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తీర్పు ఇచ్చారు. వారిపై అనర్హత పిటిషన్లను కొట్టివేశారు.

**న్యాయబద్ధంగా జరగలేదు**

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ పార్టీ మారినట్లు ఆధారాలు లేవంటూ తమ పిటిషన్లను స్పీకర్ ప్రసాద్ కుమార్ కొట్టివేయడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద స్పందించారు. సంజయ్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీలో ఎందుకు చేర్చుకున్నారని ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డి ప్రశ్నించారని గుర్తు చేశారు. కానీ స్పీకర్ పార్టీ మారిన ఎమ్మెల్యేలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అనర్హత పిటిషన్లపై కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ఆధారాలు లేవంటూ ఎనిమిది మంది పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ క్లీన్‌చిట్ ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతో బీజేపీ కూడా కుమ్మక్కయిందని ఆరోపించారు .తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ న్యాయబద్ధంగా వ్యవహరించడం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బహిరంగంగా పార్టీ మారి కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొంటున్నా స్పీకర్ కు కనబడకపోవడం విచారకరమని అన్నారు. స్పీకర్ ఏకపక్ష నిర్ణయాలను ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ చర్యలకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారుపార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు బహిరంగంగా సభలకు, కాంగ్రెస్ కార్యక్రమాలకు హాజరవుతున్నారని, అది స్పీకర్‌కు కనపడటం లేదా అని నిలదీశారు. సభాపతి ఆత్మసాక్షిగా, చట్టపరంగా నిర్ణయం తీసుకోలేకపోతున్నారని విమర్శించారు. స్పీకర్ ఆ పిటిషన్‌ను డిస్మిస్ చేయడం చట్టవిరుద్ధమేనని అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ వదిలేసినా కోర్టుల్లో శిక్ష తప్పదని అన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారు**

తెలంగాణలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీసుకుంటున్న నిర్ణయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్లను వరుసగా కొట్టివేయడం రాజ్యాంగానికి గొడ్డలిపెట్టు అని, ఇది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఆయన తీవ్రంగా ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే స్పీకర్ నడుచుకుంటున్నారని, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడం లేదని విమర్శించారు.సోషల్ మీడియాలో స్పందిస్తూ, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌పై అనర్హత పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సంజయ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఫోటోలు, వీడియోలు కళ్లముందు కనిపిస్తున్నా, ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను తిరస్కరించడం అర్థరహితమని అన్నారు. ఈ చర్య ద్వారా స్పీకర్ తన పదవికే అవమానం తెస్తున్నారని, అటు సుప్రీం కోర్టు తీర్పును, ఇటు ప్రజాతీర్పును కాలరాస్తున్నారని మండిపడ్డారు. జగిత్యాలలో మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డే ఆ ఫిరాయింపు ఎమ్మెల్యేను విమర్శిస్తున్న తరుణంలో స్పీకర్ ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీకి ఉప ఎన్నికలంటే భయం పట్టుకుందని, అందుకే ఈ నాటకాలాడుతోందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయంతో కాంగ్రెస్ ఇంకా కోలుకోలేదని, రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాగ్రహం చూసి రేవంత్ సర్కారు వణికిపోతోందని అన్నారు. ఈ మొత్తం పార్టీ ఫిరాయింపుల వ్యవహారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే సూత్రధారి అని కేటీఆర్ ఆరోపించారు. ఆయన ఢిల్లీకి పంపే మూటలకు ఆశపడి రాహుల్ గాంధీ మౌనం వహిస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇకపై రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు రాహుల్ గాంధీకి లేదని స్పష్టం చేశారు. పట్టపగలే పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారినా ఒక్కరిపైనా చర్యలు తీసుకోకపోవడం వికృత రాజకీయ క్రీడ అని, ఈ చర్యలకు ప్రజాక్షేత్రంలోనే కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

**ఇంకేమి కావాలి**

తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పార్టీ ఫిరాయింపుల కేసులో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు అని ఆమె వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యే, గాంధీ భవన్‌కు వెళ్లి కాంగ్రెస్ పార్టీ సమావేశంలో పాల్గొంటే అది పార్టీ ఫిరాయించినట్టు కాదా? అని ఆమె సూటిగా ప్రశ్నించారు.ఇంతకంటే బలమైన ఆధారాలు ఇంకేం కావాలని కవిత స్పీకర్‌ను నిలదీశారు. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ బీఫారాలను సదరు ఎమ్మెల్యేనే పంపిణీ చేసిన విషయం అందరికీ తెలిసిందేనని, ఆ విషయం స్పీకర్ దృష్టికి రాలేదా? అని ఆమె అన్నారు. ఆధారాలు లేవంటూ పిటిషన్‌ను కొట్టివేయడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు."రాజ్యాంగబద్ధమైన స్పీకర్ స్థానంలో ఉండి మీరు కాంగ్రెస్ పార్టీ నాయకుడిలా వ్యవహరిస్తున్నారని అనుకోవాలా? అదే నిజమైతే భారత రాజ్యాంగాన్ని, చట్టసభల ఔన్నత్యాన్ని మీరు ఎలా కాపాడగలుగుతారు?" అంటూ కవిత స్పీకర్ తీరును తప్పుబట్టారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో స్పందించారు.

## కాంగ్రెస్ రాజకీయ వ్యభిచారి

“స్పీకర్ అయినా మీ కళ్లకు కనిపించడం లేదా? స్పీకర్ పదవికి మచ్చ తేవడం న్యాయమేనా? ప్రజలారా.. ఓట్ల కోసం వచ్చే ఫిరాయింపు ఎమ్మెల్యేలను నిలదీయండి. వాళ్లు ఏ పార్టీలో ఉన్నారు.. ఎందుకు ఓటు వేయాలో అని అడగండి’’ అని సంజయ్ పేర్కొన్నారు. తమకు భయపడి కెటిఆర్ సిరిసిల్లలోనే అడ్డాపెట్టి ఓటుకు రూ.10 వేలు ఇస్తున్నారని ఆరోపించారు. ‘‘కెటిఆర్.. నా జోలికొస్తే రోడ్డుకీడుస్తా. కేంద్రం నిధులిస్తే.. ఆ నిధులను తినేసి సిరిసిల్లను వరదల్లో ముంచుతున్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో సిరిసిల్లకు నయా పైసా ఇవ్వలేదు. కాంగ్రెస్ వద్దనే పైసలు లేవు. వాళ్లకి ఎందుకు ఓటేయాలి? అందుకే ఆరు గ్యారంటీలను అమలు చేయలేకపోతున్నారు. మళ్లీ ఓట్ల కోసం మోసపూరిత హామీలతో మీ ముందుకు వస్తున్నారు. కాంగ్రెస్ దొంగ హామీలను నమ్మి మోసపోతే ఐదేళ్ల అరిగోస తప్పదు’’ అని సంజయ్ అన్నారు.


# సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైంది

- ప్రజల సమస్యలను వెలికితీయడంలో జర్నలిస్టుల కలం గళంగా పనిచేస్తుంది
- బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి
- జయభేరి ప్రింట్ మీడియా జర్నలిస్టు బన్నె శ్రీకృష్ణ 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఉమ్మడి మహబూబ్ నగర్ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 04 :**


సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని ఉమ్మడి మహబూబ్ నగర్ బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ జయభేరి ప్రింట్ మీడియా జర్నలిస్టు బన్నె శ్రీకృష్ణ రూపొందించిన 2026 నూతన సంవత్సర క్యాలెండర్ను బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో నవీన్ రెడ్డి ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ....



జయభేరి ప్రింట్ మీడియా యాజమాన్యానికి, ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నిజాన్ని నిర్భయంగా రాస్తూ నిరంతరం ప్రజల సమస్యలను ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, ఎప్పటికప్పుడు సమాచారం అందజేస్తూ అహర్నిశలు వారి కలాన్ని గలంగా మార్చుకొని ప్రజల పక్షాన పోరాడుతారని అన్నారు. నలుమూలలో ఎక్కడ ఏం జరిగినా మొట్టమొదటి సమాచారం జర్నలిస్టులకే అందుతుందని వారి ద్వారానే సమాచారం సామాజిక మాధ్యమాల్లో ప్రసారమవుతుందని అన్నారు.
జర్నలిస్టులు నిజ నిజాలను నిర్భయంగా రాస్తూ సమాజంలో నాలుగో పిల్లర్గా ఎంతో కీలక పాత్ర వహిస్తున్నారని అన్నారు. మంచి కోసం మార్పు కోసం ప్రజా సంక్షేమం కోసం పనిచేసే వ్యక్తిత్వం జర్నలిస్టులదని అన్నారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారమయ్యే వరకు కృషి చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం ప్రజల అభివృద్ధి కోసం పోరాడే పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీర్లపల్లి సర్పంచ్ పాండు, బండ కుమార్, దినేష్ సాగర్ ,గణేష్, బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంతోనే అన్ని విధాల అభివృద్ధి సాధ్యం

- ప్రజలు సర్వర్ పాషాను ఆశీర్వదించి గెలిపించాలి
- 17వ వార్డులో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి ఇంటింటి ప్రచారం
- సర్వర్ పాషా సతీమణి నాజియా బేగంను గెలిపించాలని విజ్ఞప్తి



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 04 :**

ప్రజా ప్రభుత్వంతోనే ప్రజలందరికీ అన్ని సంక్షేమ ఫలాలు అంది అభివృద్ధి రంగంలో నడుస్తున్నారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు మాట్లాడుతూ.. ఇచ్చిన మాట ప్రకారం రూ.2 కోట్లతో మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా వార్డులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం.. మా కాంగ్రెస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ సర్వర్ పాషా సతీమణి నాజియా బేగంను భారీ మెజారిటీతో గెలిపించండి.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ 17వ వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.
వార్డులో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ సాదిక్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, సీనియర్ నేత సుదర్శన్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిలతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 1 నుండి 28 వార్డులలో అన్ని స్థానాలు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ప్రజలు ఆలోచించి అధికార పార్టీకి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి అభివృద్ధి పనులలో ప్రజలు భాగస్వాములు కావాలని నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయుటకు తాము కృషి చేస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు ఎండి ఇబ్రహీం, జహంగీర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ విస్తృత ప్రచారం

- మంచి నీరు, పింఛన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, వంటి అనేక పథకాలు తెచ్చిన మహనీయుడు కేసీఆర్
- కెసిఆర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అండదండలతో షాద్ నగర్ గడ్డపై బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తామన్న
- "నడికూడ అనిత రఘునాథ్ యాదవ్"



**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 04 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ 22వ వార్డు అభ్యర్థి నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నడికూడ అనిత రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ.... ప్రజల సంక్షేమం కోసం గత పాలనలో భారతీయ రాష్ట్ర సమితి ఎన్నో పనులు చేసిందని ప్రతి ఒక్కరూ జై కేసీఆర్ అని నినాదాలు పలుకుతూ ఇప్పుడు కూడా ఆయన పేరు గుర్తు చేసుకుంటారని అలాంటి చరిత్ర కలిగిన గొప్ప పార్టీకి ప్రజల మద్దతు ఇచ్చి 22వ వార్డు అభ్యర్థిగా పోటీ చేస్తున్న తమను గెలిపించాలని వార్డు ఓటర్లను కోరారు. చరిత్ర కలిగిన పార్టీ బీఆర్ఎస్ పార్టీ ప్రతి పల్లెలో ప్రతి ఇంటింటికి నల్ల అందించిన మహనీయుడు కేసీఆర్ అని అన్నారు.ఒంటరి మహిళలు , వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు అదేవిధంగా ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేసి మాట నిలబెట్టుకున్న తెలంగాణ రాష్ట్ర సృష్టికర్త కేసీఆర్ అని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ తరపున బి ఫామ్ అందజేసిన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కు కృతజ్ఞతలు తెలుపుతూ.. షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 28 వార్డుల్లో అత్యధిక ఓట్లతో ప్రజల ఆశీర్వాదంతో అన్ని స్థానాలు గెలిచి షాద్ నగర్ గడ్డపై బిఆర్ఎస్ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.తాము గెలుపొందిన తర్వాత ప్రజల సమస్యల కోసం పోరాడి సమస్య పరిష్కారమయ్యే వరకు నిరంతరం శ్రమించి కృషి చేస్తామని తమ పోరాటం కేవలం ప్రజల సంక్షేమం కోసం మాత్రమేనని ప్రజలందరూ గమనించి మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సాగునీటి సంఘాల అధ్యక్షులతో భారీ సమావేశం

- హజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- మంత్రి నిమ్మల రామానాయుడు

**జయభేరి, అమరావతి :**

జలవనరుల శాఖ ఆధ్వర్యంలో గురువారం అమరావతిలో సాగునీటి సంఘాల అధ్యక్షులతో భారీ సమావేశం జరగనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హజరు కానున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ ఐదు ఏళ్ళ వైసిపి విధ్వంశ పాలనకు ఇరిగేషన్ వ్యవస్థ గాడి తప్పింది. 18వేల కోట్ల రూపాయిల బిల్లుల బకాయిలను కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా ఇచ్చారని అన్నారు. ఇరిగేషన్ శాఖను గాడిలో పెడుతూ, పోలవరం, హంద్రీనీవా, వెలిగొండ, గాలేరునగరి, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టిపెట్టాం. ఖరీఫ్ పంట ముగిసినా రాయలసీమలో సైతం, రిజర్వాయర్లలో పుష్కలంగా నీరుందంటే చంద్రబాబు వాటర్ మేనేజ్ మెంట్ వల్లే సాధ్యమైంది. నాడు రాయల కాలంలో రాయలసీమ చెరువుల నిండితే, నేడు చంద్రబాబు పాలనలో రిజర్వాయర్లు, చెరువులు నిండుకుండల్లా ఉన్నాయి. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకుని, భూమిని కూడా రిజర్వాయర్ లా మార్చుకోవాలని అన్నారు. భూగర్భజలాలు పెంచుకోవాలని, కరువు రహిత రాష్ట్రంగా మార్చుకోవాలనేది చంద్రబాబు లక్ష్యం. నీటి భద్రత, వాటర్ మేనేజ్మెంట్ , భూగర్భజలాల పెంపుపై సాగునీటి సంఘాలకు సిఎం చంద్రబాబు దిశా, నిర్దేశం చేయనున్నారని మంత్రి అన్నారు.



# వైభవంగా వెంకటేశ్వర స్వామి దర్బారు సేవ

- ముత్యాల అలంకరణలో దర్శనం ఇచ్చిన స్వామి వారు

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి దర్బారు సేవ పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ప్రతి రోజు ఒక సేవ చొప్పున దేవస్థానంలో నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఉత్సవాల 6వ రోజు స్వామివారి దర్బారు సేవ కార్యక్రమాన్ని సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానం రథ మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం దేవస్థానం పురవీధుల గుండా స్వామి వారిని ఊరేగించారు. ముత్యాలు,రకరకాల ఆభరణాలు, పూల అలంకరణలో స్వామివారు భక్తకోటికి దర్శనం ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు స్వామివారిని చూసి తరించారు.పురోహితుల వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు, కాగడాల వెలుతురు, భక్తుల హరి నామశ్చరణల మధ్య ఈ ఊరేగింపు ముందుకు కదిలింది.ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో మన్యం కొండకు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్, వంశపారంపర్య ధర్మకర్త అళహరి మధుసూదన్ కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన పూజారులు రాజేష్, నరసింహయ్య, పర్యవేక్షకుడు నిత్యానంద చారి, దేవస్థానం పురోహితులు, సిబ్బంది, వివిధ ప్రాంతాలనుండి తరలి వచ్చిన భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ గా కడారి జ్యోతి



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 04:**

పరకాల పట్టణానికి చెందిన బిఆర్ఎస్ మహిళ నాయకురాలు శ్రీమతి కడారి జ్యోతి ని పరకాల పట్టణ బిఆర్ఎస్ మహిళ కన్వీనర్గా నియమిస్తున్నట్లు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, మహిళా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న కడారి జ్యోతి సేవలను గుర్తించి ఈ బాధ్యత అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు. పరకాల పట్టణంలో బిఆర్ఎస్ మహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేసి, పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆమె కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



# డీసీపీ కార్యాలయం కోసం స్థల పరిశీలన

- పరిశీలించిన డీసీపీ శిరీష,ఎసిపి లక్ష్మీ నారాయణ, సీఐ విజయ్ కుమార్,ఎమ్మార్వో నాగయ్య

**జయభేరి, షాద్ నగర్, ఫిబ్రవరి 04 :**

రంగారెడ్డి షాద్ నగర్ పట్టణం ఫ్యూచర్ కమిషనరేట్ కు వెళ్ళడంతో షాద్ నగర్ జోన్ డీసీపీ గా శిరీషను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. అయితే డీసీపీ కార్యాలయం ప్రస్తుతం ఎసిపి కార్యాలయంలో కొనసాగుతుండగా తాత్కాలికంగా మిలీనియం టౌన్ షిప్ లో డీసీపీ కార్యాలయం రెడీ అవుతుంది.. అయితే శాశ్వత భవన నిర్మాణం కోసం ఎమ్మార్వో నాగయ్యతో కలిసి డీసీపీ శిరీష,ఎసిపి లక్ష్మీ నారాయణ, సీఐ విజయ్ కుమార్ లు కలిసి పట్టణంలోని సర్వే నంబర్ 179 లోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ రెండు ఎకరాల స్థలం,ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు.. అయితే స్థానికులు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్ద డీసీపీ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని స్థలాన్ని పరిశీలించారు.

# అభివృద్ధి చేసిన పార్టీ నాయకులను గెలిపించండి

- గజ్వేల్ మున్సిపల్ పీఠం బిఆర్ఎస్ దే : ఎమ్మెల్సీ యాదవ రెడ్డి



**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 4 :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కప్ప మమత పోచయ్య తరపున ఒకటో వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ యాదవ రెడ్డి మాట్లాడుతూ, బిఆర్ఎస్ పాలనలోనే పట్టణాలు, పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయని పేర్కొన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి బిఆర్ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ సందర్భంగా అభ్యర్థి కప్ప మమత పోచయ్య మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నెల 11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రజలు తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుపై వేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి మల్లేశం,ప్రభాకర్, స్వామి, ప్రవీణ్, చందు, కుమార్ తదితర నాయకులు, ఒకటో వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేవరకొండ మున్సిపాలిటీ ఎన్నికల సమరభేరి

- ముదిగొండ హరిదాస్ గెలుపే లక్ష్యంగా భారీ ప్రచారం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపాలిటీ ఎన్నికల వేళ రాజకీయ సందడి నెలకొంది. 6వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ముదిగొండ హరిదాస్ కి మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ వార్డులో విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల ఆశీర్వాదం కిషన్ నాయక్ హరిదాస్ వార్డులోని ప్రతి గడపకూ వెళ్లి, ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి మంత్రం గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరిస్తూ.. వార్డు సమగ్ర అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. స్థానిక మద్దతు ప్రచారంలో మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థి హరిదాస్ కి ఘనస్వాగతం పలికారు. హరిదాస్ స్థానికంగా అందుబాటులో ఉంటూ వార్డు సమస్యల పరిష్కారానికి కృషి చేసే వ్యక్తి అని కిషన్ నాయక్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముదిగొండ హరిదాస్ వార్డు ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారా దేవరకొండ అభివృద్ధిలో 6వ వార్డును అగ్రస్థానంలో నిలుపుకోవచ్చు. కారు గుర్తుకు ఓటు వేసి మన అభ్యర్థిని దీవించండి. నేనావత్ కిషన్ నాయక్, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆరో వార్డు ప్రజలను కోరినారు ఈ కార్యక్రమంలో చందంపేట మండల పార్టీ అధ్యక్షులు యాసాని రాజవర్ధన్ రెడ్డి ఆరో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక న్యాయ దినోత్సవ ఉత్సవాలు




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల దేవరకొండలో తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు, విద్యార్థినీలు ఉపన్యాసాలు గాన మరియు డిబేట్ ప్రదర్శనలు చేస్తూ, అధ్యాపకులు ఉపన్యాసములతో ఘనంగా జరుపుకున్నారని, ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, NSS UNIT I &II పి. ఓ.లు శ్యామల మేడం, మీనేశ్వారి మేడం అధ్యపక బృందం పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం హరిప్రియ తెలియజేశారు.

# బీజేపీ అభ్యర్థిని కొనుగోలు చేయడం సిగ్గుచేటు

- బీఆర్ఎస్ పతనం ప్రారంభమైంది.. డా ఖాళీ ప్రసాద్



జయభేరి, పరకాల, ఫిబ్రవరి 04:

బీఆర్ఎస్ పార్టీ పతనం మొదలైందని పరకాల బీజేపీ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ కాళీ ప్రసాద్ రావు తీవ్రంగా విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తీరుపై ఆయన ధ్వజమెత్తారు. బుధవారం పరకాల పట్టణంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశానికి హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, పరకాల ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సంతోష్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు సంపాదించిన డబ్బులతో ఇతర పార్టీల అభ్యర్థులను కొనుగోలు చేయడం మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి ఆర్థిక అహంకారానికి నిదర్శనమన్నారు. గతంలో కూడా ఇలాంటి రాజకీయాలు చేసిన బీఆర్ఎస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారని, మళ్లీ అదే పద్ధతి అనుసరించడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. బీజేపీ అభ్యర్థులు డబ్బులతో రారని, అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వస్తారని స్పష్టం చేశారు.

జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థిని బెదిరించి కొనుగోలు చేయడానికి ప్రయత్నించడం ప్రజాస్వామ్యంపై దాడి అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ.. బీజేపీ అభ్యర్థిని బెదిరించి కొనుగోలు చేసిన బీఆర్ఎస్‌కు పతనం తప్పదన్నారు. బీఆర్ఎస్ దిగజారుడు రాజకీయాలను ప్రజలు మర్చిపోలేదని చెప్పారు. గతంలో బీఫారమ్‌లతో గెలిచిన ఎమ్మెల్యేలపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యేకు గుర్తు లేవా అని ప్రశ్నించారు. బీజేపీలో నికార్సైన కార్యకర్తలే ఉన్నారని, ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. 14వ వార్డులో జరిగిన ఘటన ఓటర్లను అవమానించే నీచ రాజకీయాలకు నిదర్శనమని అన్నారు. ప్రజాస్వామ్యం గెలవాలంటే బీజేపీ పార్టీని గెలిపించాలని నాయకులు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురు ప్రసాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవనూరి మేఘనాథ్ పరకాల పట్టణ ప్రధాన కార్యదర్శి సంఘ పురుషోత్తం నడికూడ మండల అధ్యక్షుడు ఎరుకల దివాకర్ బాసాని సోమరాజు చంద్రమౌళి సల్పల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



## సోదా రామకృష్ణ కి జన్మదిన శుభాకాంక్షలు

- విశ్వనాథ్, ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ ఇంచార్జి, ఎమ్మెల్యే రేవూరి

జయభేరి, పరకాల, ఫిబ్రవరి 04:

సోదా రామకృష్ణ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి కేక్ కట్ చేసిన ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ పి విశ్వనాథ్, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్‌రెడ్డి. బుధవారం పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు సోదా రామకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని పరకాల పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విచ్చేసిన ఏఐసిసి కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ పి.విశ్వనాథ్, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, పరకాల మాజీ శాసనసభ్యులు మొలుగూరి బిక్షపతి, టిపిసిసి మాజీ ఉపాధ్యక్షులు దోమ్మాటి సాంబయ్య గార్ల చేతుల మీదుగా కేకు కట్ చేసి సోదా రామకృష్ణకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, తాజా మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన బీజేపీ అభ్యర్థి

- పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీకి మరో భారీ షాక్ తగిలింది.



జయభేరి, పరకాల, ఫిబ్రవరి 04 :

పరకాల మున్సిపాలిటీ 14వ వార్డు బీజేపీ అభ్యర్థి బొల్లెడ్ల సుష్మ కృపేందర్ బీజేపీ పార్టీకి రాజీనామా చేసి పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి, రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సమక్షంలో భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) లో చేరారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నేతలు వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో పరకాల పట్టణ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందించిన పారదర్శక పాలనకు ఆకర్షితులై బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు సుష్మ కృపాకర్ పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ, పరకాలలో బిఆర్ఎస్ బలం రోజు రోజుకు పెరుగుతుందని, ఇతర పార్టీల నాయకులు స్వచ్ఛందంగా బిఆర్ఎస్‌లో చేరడం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో పరిగెడుతున్న కారు



జయభేరి, దేవరకొండ :

మున్సిపాలిటీ ఎన్నికల వేళ రాజకీయ సందడి నెలకొంది. 8వ వార్డు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి నేనావత్ నగేష్ నాయక్ కు మద్దతుగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ ఈరోజు వార్డులో విస్తృత స్థాయిలో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల ఆశీర్వాదంతో కిషన్ నాయక్ నగేష్‌నాయక్ వార్డులోని ప్రతి గడపకూ వెళ్లి, ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి మంత్రం గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను వివరిస్తూ వార్డు సమగ్ర అభివృద్ధి చెందాలంటే కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. స్థానిక మద్దతు ప్రచారంలో మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థి నగేష్ నాయక్ కి ఘనస్వాగతం పలికారు. స్థానికంగా అందుబాటులో ఉంటూ వార్డు సమస్యల పరిష్కారానికి కృషిచేసే వ్యక్తి అని కిషన్ నాయక్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. నేనావత్ నగేష్ నాయక్ వార్డు ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించడం ద్వారా దేవరకొండ అభివృద్ధిలో 8వ వార్డును అగ్రస్థానంలో నిలుపుతాను కారు గుర్తుకు ఓటు వేసి మన అభ్యర్థిని దీవించండి అని ఓటర్లను అభ్యర్థించినారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

- బిఆర్ఎస్ పార్టీ తోనే మున్సిపాలిటీల అభివృద్ధి



జయభేరి, దేవరకొండ :

దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో బిఆర్ఎస్ పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ తోనే మున్సిపాలిటీల అభివృద్ధి జరిగింది అని ఆయన తెలిపారు.రెండు సంవత్సరాలలో దేవరకొండ మున్సిపాలిటీకి కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి శూన్యం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మొదటి మున్సిపాలిటీ చైర్మన్ కేతావత్ మంజ్య నాయక్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేనావత్ కిషన్ నాయక్, గాజుల ఆంజనేయులు,నీల రవికుమార్,16వ అభ్యర్థి కేతావత్ రూప్ల నాయక్, కేతావత్ లాలూ ప్రసాద్, వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, వడత్య బాలు, నల్లగాసు సత్యనారాణ, జమీర్ బాబా,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.




## క్రీడలతో మానసిక ఉల్లాసం

- ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి

జయభేరి, దేవరకద్ర :

క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీమణి కవితా మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని చిన్నచింతకుంట మండలం ధమగ్నాపూర్ లో బుధవారం ఎమ్మెల్యే జిఎంఆర్ తండ్రి స్వర్గీయ గవినోళ్ళ కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం నిర్వహించిన ప్రీమియర్ లీగ్ (డిపిఎల్) క్రికెట్ టోర్నమెంట్ లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బుధవారం ఎమ్మెల్యే సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి ప్రసంగించారు. క్రీడలను అందరు ప్రోత్సహించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. ప్రశాంత వాతావరణంలో క్రీడా పోటీలను నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి కవిత మధుసూదన్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో ఇంటింటి ప్రచారం

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, చల్లా ధర్మారెడ్డి, కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి

జయభేరి, పరకాల, ఫిబ్రవరి 04 :



కాంగ్రెస్ మోసాలకు ప్రజలు తగిన బుద్ధిచెప్పాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ ,పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ,కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి అన్నారు. బుధవారం పరకాల పట్టణంలోని పలు వార్డులలో ఇంటిటి ప్రచారం నిర్వహించి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం కొత్త బొడ్రాయి సెంటర్లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు ప్రజలనుద్దేశించి ప్రసంగిచారు. చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ మెసాలకు ప్రజలు మున్సిపాలిటీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని గృహలక్ష్మి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వకుండా గందరగోళం చేస్తు ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్ఎస్ హయాంలోనే పరకాల పట్టణం ఎంతో అభివృద్ధి చెందింది అని అన్నారు. గడిచిన రెండేళ్లలో పరకాల పట్టణంలో ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు తెలపాలని ప్రశ్నిస్తున్న. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులు రద్దుచేసిన ఘనత ప్రస్తుత ఎమ్మెల్యేది. బిఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలు ధ్వంసం చేశారు.వాటి స్థానంలో కొత్తవి పెట్టి మేమె చేశామని గప్పాలు కొడుతున్నారు. మీకు దమ్ముంటే 100 పడకల హాస్పిటల్, డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్, దామెర చెరువు మినీ ట్యాంకు బ్యాండ్ పూర్తిచేయాలన్నారు. రెండేళ్ళ మోసపూరిత కాంగ్రెస్ పాలనపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మన అందరిది. ప్రజలంతా కాంగ్రెస్ మోసాలను గ్రహించారు. మళ్లి కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోవడానికి సిద్ధంగా లేరు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల ఘన విజయం ఖాయం. పరకాలలో గులాబీ జెండా ఎగురవేయడం ఖాయం.

కేతిరెడ్డి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విస్మరించింది. రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ రాష్ట్రాన్ని ధ్వంసం చేసింది. కేసీఆర్ మళ్ళీ సీఎం కావాలంటే మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలిపించాలి. ప్రతి కార్యకర్త పట్టుదలతో పనిచేస్తేనే మన అభ్యర్థులు గెలుపు సాధ్యమని అన్నారు. ఓట్లకోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను ఇచ్చిన హామీలేవని నిలదీయాలని అన్నారు.

ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రెండున్నరేళ్లలో రాష్ట్రానికి రేవంత్ చేసిందేమైనా ఉందా? కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. రైతుల సాగునీటి, కరెంటు కష్టాలు తీర్చిన మహనీయుడు కేసీఆర్. రెండు సార్లు శాసనసభ్యులుగా పనిచేసిన చల్లా ధర్మారెడ్డి పరకాల ప్రజల గుండెల్లో ఉన్నారు. మోసపు హామీలతో వచ్చే కాంగ్రెస్ నాయకులను నమ్మి మళ్లీ మోసపోవద్దు ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నేతలను 6 గ్యారంటీలు ఏమయ్యాయని నిలదీయండి అని ప్రజలకు సూచించారు. తులం బంగారం, స్కూటీలు ఏమయ్యాయని ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ వాళ్ళను ఆడబిడ్డలు నిలదీయండి. దొంగ హామీలు ఇచ్చిన దొంగలను గల్లా పట్టి నిలదీయండి. పేద విద్యార్థుల కోసం గురుకులాలను కట్టించారు కేసీఆర్. బస్తీ దవాఖాలను ఏర్పాటు చేసి వైద్యాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చిన కేసీఆర్. రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో 128 మంది గురుకుల విద్యార్థులు మృతి చెందారు. చెక్‌డ్యాంలను బాంబులతో పేల్చినా ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. పట్టణ ప్రగతి కింద వీధిలైట్లు, డ్రైన్లు, పార్కులు, డంప్‌యార్డులు వేయించిన కేసీఆర్ ప్రభుత్వం. ఎర్రవెల్లికి వెళ్లకుండా నందినగర్‌లో కేసీఆర్ ఇంటికి సిట్ నోటీసులు అంటించారు. కేసీఆర్ ఎర్రవెల్లి నివాసం మంత్రులకు తెలుసు సిట్ అధికారులకు తెల్వదా? తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను ఘోరంగా అవమానించింది కాంగ్రెస్ ప్రభుత్వం. నెర్రెలువారిన భూములను సస్యశ్యామలంగా మార్చింది కేసీఆర్ ప్రభుత్వం. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో గ్రామాలు తెలువని స్థానిక ఎమ్మెల్యే ప్రజలకు ఏమి చేస్తారని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరలో భక్తులకు సౌకర్యాలని కల్పించని వీళ్ళకు మున్సిపాలిటీని పాలించే సత్తా ఉంటదా. ఆగిపోయిన రోడ్లు, మురికికాల్వల పనులు పూర్తి కావాలన్నా.. మన బతుకు బాగుపడాలన్నా బీర్ఎస్‌ను గెలిపించండి. ఈ కార్యక్రమంలో 1,2,3,12,13,14,15,22 వార్డుల బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీలోకి చేరికలు

జయభేరి, దేవరకొండ :



మున్సిపాలిటీ పరిధిలోనీ 16వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన 30 మంది కార్యకర్తలను కండువాలు కప్పి పార్టీలోకి మాజీ శాసనసభ్యులు రవీంద్ర కుమార్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి వివరించాలని సూచించారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలన పట్ల అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని, రేవంత్ సర్కార్ పరిపాలనకు చరమగీతం పడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. రేవంత్ సర్కార్ ను గద్దె దించేందుకు ప్రజలు వారి ఓట్లతో గుణపాఠం చెప్పాలని... బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై వారి అమూల్యమైన ఓటు నమోదు చేయాలని కోరారు. రానున్నది మన ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ గుర్తుతో సంబంధం లేని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతిచ్చిన అభ్యర్థులు రాష్ట్ర వ్యాప్తంగా 40 శాతం పైగా గెలుపొందారని అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుపై పోటీ చేస్తున్న అభ్యర్థులను బంపర్ మెజారిటీ తో గెలిపించుకోవాలని అన్నారు.బీఆర్ఎస్ పార్టీలో చేరిన కార్యకర్తలు క్రమశిక్షణ, అంకితభావంతో కౌన్సిలర్ అభ్యర్థి కేతావత్ రూప్ల నాయక్ గెలుపు కోసం సమిష్టి కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మొదటి మున్సిపాలిటీ చైర్మన్ కేతావత్ మంజ్య నాయక్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేనావత్ కిషన్ నాయక్, గాజుల ఆంజనేయులు,నీల రవికుమార్,16వ అభ్యర్థి కేతావత్ రూప్ల నాయక్, వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, వడత్య బాలు, నల్లగాసు సత్యనారాణ, జమీర్ బాబా,ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలులో ఘోర వైఫల్యం చెందింది

- మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లారెడ్డి
- బిఆర్ ఎస్ పాలనలో ప్రజలకు న్యాయం జరిగింది.

జయభేరి, శామీర్ పేట్ :



మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందిని, కాంగ్రెస్ అంటేనే మోసపూరిత పార్టీ అని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లా రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా బుధవారం మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగ్గంగూడ సంపన్ బోల్, ఉద్దెమర్రి లో నిర్వహించిన ఇంటింటా ప్రచారంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజలు కష్టాల భారిన పడ్డారని ఆరోపించారు. గత బీఆర్ ఎస్ ప్రభుత్వ హాయంలోనే ప్రజలు సంతోషంగా ఉన్నారని, ప్రతి ఇంటికి సక్రమంగా సంక్షేమ పథకాలు అందాయని గుర్తు చేశారు. గ్రామాలు, పట్టణాల అభివృద్ధి జరిగిందంటే కేవలం కేసీఆర్ హయంలోనే జరిగిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని , ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కిందన్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా తాగేందుకు గుక్కెడు నీరు దొరకడం లేదని , వేసవి కాలం రాకముందే ఇలా ఉంటే ఇక వచ్చే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చునని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం పన్నుల కోసమే గ్రామాలను పట్టణాలుగా ఏర్పాటు చేశారని మండిపడ్డారు. మహిళలకు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, వృద్ధులకు రూ.4000 ఫింఛన్ ఇస్తా మని ఎన్నికల్లో హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికి వరకు ఆ ఊసే లేదన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం 60 ఏండ్లు పాలించి ప్రజలకు చేసిందేమీ లేదని ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని అన్నారు. అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల ఇంచార్జి గజ్జల నాగేష్, సీనియర్ నాయకులు భద్రా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి, సుధాకర్, జహంగీర్, రవీందర్ రెడ్డి, నవీన్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమల్లో కాంగ్రెస్ భేష్

- మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- అభివృద్ధిని చూసి ఓటు వేయాలని పిలుపు
- అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం - మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్

జయభేరి, శామీర్ పేట్ :



కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదపడతాయని, రాష్ట్ర రోడ్లు, భవనాలు & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో మున్సిపాలిటీలపై కాంగ్రెస్ జెండాఎగురవేస్తామనీ ఆయన స్పష్టం చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలోని మూడుచింతలపల్లి, అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్,లతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా ప్రభుత్వంగా రెండు సంవత్సరాల వ్యవధిలో అనేక సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు. ఎన్నికల హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి, గృహజ్యోతి పథకం, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు వంటి పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు ఘన విజయం అందించాలని ఆయన కోరారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబానికి ప్రత్యక్షంగా లబ్ధి చేకూరుస్తున్నాయని అన్నారు. ప్రజల ఆశీర్వాదాలతో మేడ్చల్ నియోజకవర్గంలోని మూడు చింతలపల్లి, అలియాబాద్ మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.కాగా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వీరారెడ్డి చౌరస్తా వద్ద, అలాగే అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అలియాబాద్ చౌరస్తా వద్ద ప్రచార కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి, జిల్లా మార్కెట్ కమిటీ ఛైర్మెన్ నర్సింహా యాదవ్, జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం బి బ్లాక్ అధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ఎన్నికల ఇంచార్జ్ ఎన్నికల ఇన్చార్జ్ , మాజీ మేయర్ తోటకూర అజయ యాదవ్, అమర్ సింగ్, మూడు చింతలపల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేష్, అలియాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు తుంకి రమేష్, మేడ్చల్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఫలించిన హెచ్ బీ ఎల్ పరిశ్రమ కార్మికుల పోరాటం

- రోజు వారి వేతనం పెంపునకు అంగీకారం తెలిపిన పరిశ్రమ యాజమాన్యం
- ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి జోక్యంతో సద్దుమణిగిన సమస్య
- ఎమ్మెల్యేలకు కృతజ్ఞతలు తెలిపిన పరిశ్రమ కార్మికులు

జయభేరి, శామీర్ పేట్ :



అలియాబాద్ మున్సిపల్ పరిధిలో హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ పరిశ్రమలో గత కొన్ని రోజులుగా వేతనాల పెంపుపై కార్మికులు ధర్నా చేపట్టారు. చేపట్టిన జీతాల పెంపు ధర్నా ఫలితమిచ్చింది. గత మూడు రోజులుగా జీతాలు పెంచాలంటూ కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. అయితే కార్మికుల సమస్యపై స్పందించిన మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి యాజమాన్యంతో చర్చించి పరిష్కరించారు. కంపెనీలో గత కొన్ని సంవత్సరాలుగా సుమారు 4,000 మంది కార్మికులు కాంట్రాక్ట్ లేబర్‌గా పని చేస్తూ చాలీచాలని జీతాలతో పనిచేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు . పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా వేతనాలు సరిపోక పోవడంతో రోడ్డున పడే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తూ కార్మికులంతా కలిసి ధర్నా చేపట్టారు. కాగా ఈ ధర్నాకు మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి కూడా మద్దతుగా నిలిచి, కార్మికుల తరపున యాజమాన్యంతో చర్చలు జరిపారు. అలియాబాద్ మున్సిపల్ ఎన్నికల బిఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జిగా ఉన్న మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సమస్యను సానుకూలంగా పరిష్కరించారు. ఎమ్మెల్యేల చర్చల అనంతరం కంపెనీ మేనేజర్ శ్రీకాంత్ ద్వారా హెచ్ బి ఎల్ ఇంజనీరింగ్ కంపెనీ యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి, కార్మికులకు ప్రస్తుతం అందిస్తున్న డైలీ నగదుపై ఎంట్రీ గేట్ పెంపు చేయడానికి అంగీకారం సాధించారు. ఈ నిర్ణయంతో కార్మికుల్లో ఆనందం వెల్లివిరిసింది. తమ సమస్యను సానుకూలంగా పరిష్కరించినందుకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, చామకూర మల్లారెడ్డికి కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు.



# అయ్యా ఎమ్మెల్యే గారు మా గోడును పట్టించుకోరా..?

- దోర్నకల్ మున్సిపాలిటీని రద్దు చెయ్యండి
- జాటోతు రామా చంద్రు నాయక్, శాసనసభ్యులకు, దోర్నకల్
- ఓ యువకుడి విన్నపం

జయభేరి, దోర్నకల్ :

గౌరవనీయులైన జాటోతు రామా చంద్రు నాయక్ శాసనసభ్యులు, దోర్నకల్ నియోజకవర్గం డిప్యూటీ స్పీకర్, తెలంగాణ శాసనసభ ప్రభుత్వ VIP తెలంగాణ రాష్ట్రం దోర్నకల్ మున్సిపాలిటీని రద్దు చేసి గ్రామ పంచాయతీగా కొనసాగించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాము. వినయపూర్వకంగా తెలియజేయునది ఏమనగా, దోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలలో 50% కంటే ఎక్కువగా ఓటర్లు, జనాభా SC/ST వర్గాలకు చెందినవారే ఉన్నారు. ముఖ్యంగా తండా ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజనులు అధిక సంఖ్యలో ఉండటం గమనార్హం. అదేవిధంగా, మా ప్రాంతంలో సుమారు 90% మంది ప్రజలు రోజువారీ కూలీలుగా జీవిస్తున్నారు. మున్సిపాలిటీగా మారిన తరువాత పన్నులు, ఛార్జీలు పెరిగి ప్రజలపై తీవ్రమైన ఆర్థిక భారం పడుతోంది. ఆదాయం తక్కువగా ఉండటంతో ఈ భారం భరించడం ప్రజలకు అసాధ్యంగా మారింది. ముఖ్యంగా, మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చిన కారణంగా MGNREGA (ఉపాధి హామీ) పథకం తొలగించబడటం వల్ల పేదలు, కూలీలు, గిరిజనులు తీవ్రమైన జీవనాధార సమస్యలను ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అందిన సంక్షేమ పథకాల లబ్ధి ప్రస్తుతం పూర్తిగా అందడం లేదు. మా ప్రాంత సామాజిక-ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, దోర్నకల్ మున్సిపాలిటీగా కాకుండా గ్రామ పంచాయతీగా కొనసాగితేనే పేద ప్రజలకు, SC/ST వర్గాలకు, గిరిజనులకు న్యాయం జరుగుతుందని మా గట్టి నమ్మకం. అందువల్ల, దోర్నకల్ మున్సిపాలిటీని రద్దు చేసి తిరిగి గ్రామ పంచాయతీగా మార్చే విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని మిమ్మల్ని వినమ్రంగా కోరుతున్నాము. మీ వంటి ప్రజాప్రతినిధి సహకారంతో మా ప్రాంత ప్రజలకు న్యాయం జరుగుతుందని ఆశిస్తూ తమ గోడును పట్టించుకోవాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అధోగతి పాలైంది

- అలియాబాద్ మున్సిపాలిటీలో బిఆర్ ఎస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లారెడ్డి
- రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో విఫలమైందని విమర్శ

జయభేరి, శామీర్ పేట్ :



రాష్ట్ర అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, ఈ ప్రభుత్వ పాలనతో తెలంగాణలో పెద్ద శని కూర్చుందని, ఆ శని పోవాలంటే అలియాబాద్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిందేనని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి స్పష్టం చేశారు. అలియాబాద్ మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంతరం నిర్వహించిన సభలో ప్రసంగించి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. అలియాబాద్‌లో ప్రతి రోడ్డు, ప్రతి గల్లీ అభివృద్ధి బిఆర్ ఎస్ హయాంలోనే జరిగిందని మల్లారెడ్డి పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రూ.70 లక్షల వ్యయంతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి చేశామని తెలిపారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఉపయోగపడే ఒక్క పథకం కూడా లేదని విమర్శించారు. రైతుబంధు వంటి పథకాలు కాంగ్రెస్ ఎప్పుడూ ఇవ్వలేదని, కేసీఆర్ నాయకత్వంలో పదేళ్ల పాలనలో తెలంగాణ అన్నపూర్ణ రాష్ట్రంగా మారిందన్నారు. ప్రతి పల్లెలో వరి పంటలు విస్తారంగా పండాయని, రాష్ట్రవ్యాప్తంగా 44 వేల చెరువులు నిండుకుండలా కళకళలాడాయని గుర్తుచేశారు. మే నెలలో సైతం చెరువుల్లో నీరు ఉండే పరిస్థితి కేసీఆర్ పాలనలోనే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలు, చెరువులు నీరులేక ఎండిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భగీరథ పథకం ద్వారా ప్రతి గ్రామానికి మంచినీటిని అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని మల్లారెడ్డి కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఆడపిల్లలకు రూ.2,500, తులం బంగారం, స్కూటీలు ఇస్తామని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారని విమర్శించారు. ప్రజలకు నీరు, కరెంటు, మౌలిక వసతులు అందించి మహోన్నత నాయకుడిగా గుర్తింపు పొందిన కేసీఆర్‌ను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. అభ్యర్థులను కాకుండా కేసీఆర్‌ను చూసి కారు గుర్తుకు ఓటు వేసి, అలియాబాద్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఇక 7వ వార్డు నుంచి దాసరి నరసింహ, 8వ వార్డు నుంచి బండి లక్ష్మీరామిరెడ్డి, 9వ వార్డు నుంచి యమునా శ్యాం, 17వ వార్డు నుంచి ముద్దం మధుసూదన్ రెడ్డి, 18వ వార్డు నుంచి సగ్గు శ్రీనివాస్, 19వ వార్డు నుంచి బండారి కుమార్ యాదవ్, 20వ వార్డు నుంచి బోయిని రోజా రాజును గెలిపించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు .ఈ కార్యక్రమంలో అలియాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, బిఆర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# పాత కక్ష్యల నేపథ్యంలో బాబాయ్ హత్య

జయభేరి, వికారాబాద్ :

వికారాబాద్ జిల్లా ధరూర్ మండల కేంద్రంలో పట్టపగలే నడి రోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైయ్యాడు.హత్య చేసిన నిందితుడు దారూర్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. హత్యకు గురైన వ్యక్తి దారూర్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన శంకర్ గా గుర్తించారు స్థానికులు. గతంలో భూ వివాదంలో ఉన్న పాత కక్ష్యల కారణంతో సోంత అన్న కొడుకే బాబాయ్ ని హత్య చేసాడని చెప్తున్నారు గ్రామస్తులు. దారూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# ఉపాధి హామీ పనులను ప్రారంభించిన సర్పంచ్ నల్ల సుమిత

జయభేరి, చింతపల్లి, ఫిబ్రవరి 04:

మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులను, ఉపాధి హామీ కూలీలతో కలిసి, గ్రామ సర్పంచ్ నల్ల సుమిత రఘుమారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో చేపట్టనున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. సర్పంచ్ ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పథకం ద్వారా గ్రామ ప్రజలకు ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పనులను నాణ్యతతో పారదర్శకంగా చేపట్టాలని సంబంధిత అధికారులతో అన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి వడ్డించారు. విద్యార్థులకు పౌష్టికమైన భోజనం అందించాలని పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్థులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్.టి.ఐ కమీషనర్ సహకారంతో కోతుల నియంత్రణకు చర్యలు





జయభేరి, తుర్కపల్లి, ఫిబ్రవరి 04 :

తుర్కపల్లి మండల కేంద్రంలో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కోతుల సమస్యకు పరిష్కారం దిశగా చర్యలు కొనసాగుతున్నాయని తెలంగాణ రాష్ట్ర ఆర్టిఐ కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఆయన సహకారంతో కోతులను పట్టించే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోన్లలో కొన్ని కోతులు, మిగిలిన కోతులను ఏ విధంగా సురక్షితంగా పట్టుకోవాలని విషయంపై కోతులను పట్టే సిబ్బందికి అవసరమైన సూచనలను, మార్గనిర్దేశం చేశారు. కోతుల వల్ల పంటలు, ఇండ్లపై నష్టం జరుగుతుండడంతో గ్రామస్తులు నెలకొన్న ఆందోళన తగ్గించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సోమల వెంకటేశం, ఉపసర్పంచ్ పల్లె నరేష్ గౌడ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషా స్పందన



జయభేరి, పరవాడ:

పరవాడ మండల కేంద్రంలో బుధవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేషా స్పందన లభించింది.చుట్టూ పక్కల గ్రామాల నుంచి సుమారు 150 మంది వరకు పరీక్షలు చేయ్యించుకోవడానికి వచ్చారని డాక్టర్ కె గోపి కృష్ణ తెలియజేసారు.పరీక్షలకి వచ్చిన వారిలో 56 మందికి మందులు 24 మందికి కళ్ళజోళ్ళు ఇవ్వడం జరిగింది అని అలాగే 48 మందికి శాస్త్ర చికిత్స కోసం హాస్పిటల్కి తీసుకువెళ్లడం జరిగింది అని తెలియజేసారు.ఈ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి ప్రధాన కారణం అయ్యిన శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్కి,మనస్వి ఎంటర్ప్రిసెస్ యజమాని బండారు రాజుకి డాక్టర్ గోపి కృష్ణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కార్పొరేటర్ బన్నాల

- చిల్కానగర్ డివిజన్ కళ్యాణపురిలో నూతన శివరేజ్ లైన్ కు శంకుస్థాపన చేసిన కార్పొరేటర్ బన్నాల

జయభేరి, ఉప్పల్ :


చిల్కానగర్ డివిజన్లోని కళ్యాణపురి కాలనీలో నూతన సీవరేజ్ పైప్ లైన్ పనులకు శంకుస్థాపన చేసిన చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్. అనంతరం వారు మాట్లాడుతూ.. కాలనీ అసోసియేషన్ సభ్యుల అభ్యర్థన మేరకు ఎన్నో రోజుల నుండి పాత శివరాజ్ పైప్లైన్ తో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని తెలిసిన వెంటనే నూతన సీవరేజ్ పైప్ లైన్ నిర్మాణానికి ఏర్పాటు చేయడం జరిగిందని శివరాజ్ పైప్లైన్ నిర్మాణం పూర్తయిన వెంటనే నూతన సిసి రోడ్డు కూడా వేయించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ పలే రాజ్ కుమార్ గౌడ్ , సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి ,కొకొండ జగన్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ శ్యామ్, బాలు ,కలనీ వాసులు రాములు, నరేష్ గౌడ్ ,లక్ష్మీ రాజ్యం గౌడ్, హమీద్ మొదలగువారు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్

- పార్టీని వీడిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు
- పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడంపై అసంతృప్తి
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో బిఆర్ ఎస్ లో చేరిక

**జయభేరి, శామీర్ పేట్ :**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పార్టీల నాయకులు అధిష్టానాలకు గట్టి షాక్ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో అలియాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో తమ శ్రమకు తగిన గుర్తింపు లేకపోవడంతో పాటు, అవకాశాలు రాకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ పార్టీకి రాజీనామా చేశారు. ఈ క్రమంలో 5వ వార్డుకు చెందిన చాట్లపల్లి సంపత్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసినా, చివరికి బీఫారం కూడా ఇవ్వకుండా తన ఆశలను కాంగ్రెస్ పార్టీ చిదిమేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ లోపల కుమ్ములాటలు, అవకాశవాద



రాజకీయాలు, నిజాయితీగా పనిచేసే కార్యకర్తలకు అన్యాయం జరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమను ఆకర్షించాయని, ఈ కారణంగా తాము బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ సందర్భంగా అలియాబాద్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో అలియాబాద్ చౌరస్తా లోని బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో అధికారికంగా పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ తన స్వార్థ రాజకీయాలతో కార్యకర్తలను నిరాశకు గురి చేస్తోందని, అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ నిజాయితీగా పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం, గుర్తింపు ఇస్తుందని అన్నారు. ఇక బిఆర్ ఎస్ లో చేరిన వారందరికీ పార్టీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి నాగేష్ గౌడ్, 6వ వార్డు అభ్యర్థి తలారి కృష్ణ, ఆల నరేష్ రెడ్డి, నరసింహా రెడ్డి, నల్ల వెంకటేష్, ఉప్పల నవీన్, ఉప్పల అశోక్, మచ్చ అశోక్, మురళి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ను మర్యాద పూర్వకంగా కలిసిన ఎండి రాజు

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా ఎస్సీ-ఎస్టీ డివిఎంసి (డిస్ట్రిక్ట్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ) సభ్యులుగా మరియు రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా ములకలపల్లి రాజు నియమితులైన సందర్భంగా బుధవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ కార్యాలయంలో అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా అడిషనల్ ఎస్పీ ఎం. మోహన్ రావు, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్,ఎన్. సత్యనారాయణ రావును, శాలువాతో సత్కరించారు .డివియంసి రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా ఎండి రాజు కు,జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎస్సీ-ఎస్టీ వర్గాల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలు, సామాజిక న్యాయం సాధన దిశగా కమిటీ మరింత చురుకుగా పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు ఆకాంక్షించారు. జిల్లా స్థాయిలో ఎస్సీ-ఎస్టీ వర్గాల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయంతో పనిచేస్తామని ములకలపల్లి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిఎంసి సభ్యులు జి. సహదేవుడు, బొడ్డేడు అప్పారావు, టి జయశ్రీ, ఎం పైడి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఖర్చుపై అభ్యర్థులతో సమావేశం

- మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల ఖర్చుల వివరాలను తప్పనిసరిగా తెలపాలి - జిల్లా ఎన్నికల అబ్జర్వర్ సునయన చౌహాన్




**జయభేరి, శామీర్ పేట్, జయభేరి 4 :**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీ అభ్యర్థుల ఖర్చుల వివరాలను తప్పనిసరిగా తెలపాలని మేడ్చల్ జిల్లా ఎన్నికల వ్యయ అబ్జర్వర్ సునయన చౌహాన్ స్పష్టం చేశారు. అలియాబాద్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల ఖర్చులపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే పార్టీల అభ్యర్థులు తప్పనిసరిగా తమ ఖర్చుల వివరాలను పొందుపర్చాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిటర్ వెంకటేశం, రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, పార్టీల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.


## ఆలయాలు, స్కూళ్లు, ఆస్పత్రుల సమీపంలో మాంసం విక్రయాలకు బ్రేక్?

- రాష్ట్రానికి హైకోర్టు సూచన



**జయభేరి, హైదరాబాద్:**

ఆలయాలు, విద్యా సంస్థలు, ఆస్పత్రుల నుంచి 100 మీటర్ల పరిధిలో మాంసం, నాన్‌వెజ్ ఆహార పదార్థాల విక్రయాన్ని నియంత్రించే విధానాన్ని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు సూచించింది. భక్తుల మనోభావాలు, ప్రశాంతత, పరిశుభ్రత, శాంతిభద్రతలు, ట్రాఫిక్ సమస్యలను పరిగణనలోకి తీసుకొని స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని మున్సిపల్, హోంశాఖ ముఖ్య కార్యదర్శులను ఆదేశించింది. మాంసం విక్రయ కేంద్రాల ప్రారంభానికి సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) పొందే నిబంధనను విధానంలో చేర్చాలని హైకోర్టు సూచించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లో పూర్తి చేయాలని స్పష్టం చేసింది. హైదరాబాద్ రెడ్‌హిల్స్ ప్రాంతంలో తన మాంసం వ్యాపారాన్ని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ డిప్యూటీ కమిషనర్, నాంపల్లి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ మహారాష్ట్రకు చెందిన బిపిన్ రాందాస్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. వాదనలు విన్న అనంతరం ఈ అంశంపై సమగ్ర మార్గదర్శకాలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేసింది.



## కూకట్పల్లి జోనల్ కార్యాలయంలో ఏసీబీ మెరుపు దాడులు

- రూ.15 లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ వలకు చిక్కిన జీహెచ్ఎంసీ ఎస్ఈ

**జయభేరి, కూకట్పల్లి :**

కూకట్పల్లి జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) చిన్నారెడ్డి ఓ కాంట్రాక్టర్ నుంచి రూ.15 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల క్లియరెన్స్ కోసం లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వర్గాలు తెలిపాయి. ముందుగా ఫిర్యాదు అందడంతో పక్కా ప్రణాళికతో వలపన్నిన అధికారులు, లంచం స్వీకరిస్తున్న సమయంలోనే ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, ఇలాంటి చర్యలపై కఠిన చర్యలు కొనసాగుతాయని ఏసీబీ స్పష్టం చేసింది.

## జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీని స్వాగతించిన రాష్ట్ర నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి



**జయభేరి, హైదరాబాద్ :**

మొదటి సారి తెలంగాణ రాష్ట్రంలో మహబూబ్ నగర్‌లో నిర్వహించిన విజయ సంకల్ప సభలో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ని కలిసి స్వాగతించడం ఎంతో ఆనందంగా, గర్వంగా అనిపించిందని నెల్లి వర్ధన్ రెడ్డి అన్నారు. ఈ సభలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు, పాలమూరు పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, రాజ్యసభ సభ్యులు డా. లక్ష్మణ్, ఆశిష్ షెల్లార్, మహారాష్ట్ర మంత్రులు, ఎంఎల్సీలు, ఏవీఎన్ రెడ్డి, కొమరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు గౌతమ్ రావు అశోక్ కుమార్, ఉమ్మడి జిల్లా రాష్ట్ర నాయకులు ఆచారి నాగురావు, నమోజీ, కట్ట సుధాకర్ తదితర ప్రముఖులు పాల్గొని సభకు మరింత ప్రాధాన్యత తీసుకువచ్చారు. ఉమ్మడి పాలమూరు జిల్లా నలుమూలల నుండి కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై బీజేపీ పట్ల ఉన్న అపారమైన విశ్వాసం మరియు ఉత్సాహాన్ని మరోసారి చాటిచెప్పారు. నితిన్ నబీన్ ప్రేరణాత్మక, ఉత్తేజభరిత ఉపన్యాసం కార్యకర్తల్లో కొత్త జోష్ నింపింది. భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ విజయానికి ఈ సభ బలమైన సంకల్పంగా, చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందన్నారు.

## పిల్లల చదువుపై తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- గంగిరెడ్ల కాలనీలో ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించిన పరవాడ పోలీస్ శాఖ

**జయభేరి, పరవాడ:**



పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకెల పాలెం గ్రామంలో ఇటీవల పరవాడ ఎస్ఐ బి. కృష్ణ రావు స్కూల్‌ను సందర్శించిన సందర్భంగా కొంతమంది పిల్లలు నిరంతరం స్కూల్‌కు హాజరు కావడం లేదని సమాచారం తెలుసుకున్న ఎస్ఐ పిల్లల చదువుపై తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని భావించిన పరవాడ పోలీసులు, స్కూల్ యాజమాన్యంతో సమన్వయం చేసుకుని గంగిరెడ్ల కాలనీని ప్రత్యక్షంగా సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నివసిస్తున్న తల్లిదండ్రులతో సమావేశమై, పిల్లలను స్కూల్‌కు పంపకపోవడం వల్ల వారి భవిష్యత్తుపై పడే దుష్ప్రభావాల గురించి వివరించారు. పిల్లల విద్య వారి జీవితానికి పునాది అని, చదువు ద్వారా మాత్రమే మంచి భవిష్యత్తు, మంచి అవకాశాలు లభిస్తాయని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. రోజూ తప్పనిసరిగా పిల్లలను స్కూల్‌కు పంపించాలని, చదువును నిర్లక్ష్యం చేయరాదని, అలాగే స్కూల్‌కు రాకపోవడం అలవాటుగా మారితే పిల్లలు తప్పుదారి పట్టే ప్రమాదం కూడా ఉందని వివరించారు. ఈ సందర్భంగా ప్రతి తల్లిదండ్రితో ప్రత్యేకంగా కౌన్సిలింగ్ నిర్వహించి, పిల్లలపై మరింత శ్రద్ధ చూపాలని, వారి హాజరు, చదువు విషయాల్లో బాధ్యత తీసుకోవాలని సూచించారు. పిల్లల భద్రత, చదువు, శ్రేయస్సు పట్ల పోలీస్ శాఖకు ఉన్న బాధ్యతలో భాగంగానే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పరవాడ పోలీసులు తెలిపారు. పోలీస్ శాఖ కేవలం చట్ట పరిరక్షణకే పరిమితం కాకుండా, సమాజంలో పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో ఇలాంటి సామాజిక బాధ్యత కార్యక్రమాలు నిరంతరం చేపడుతుందని అన్నారు.

## ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్ పత్రాలను దగ్ధం చేసిన అంగన్వాడీలు

**జయభేరి, పరవాడ:**




ప్రజా వ్యతిరేక, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక కేంద్ర బడ్జెట్ కాపీల్ని లంకెలపాలెం పరవాడ రోడ్డుపై తాసిల్దార్ కార్యాలయం ఎదుట దగ్ధం చేసి సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం పరవాడ తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గని శెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన 53 లక్షల కోట్ల బడ్జెట్ లో కార్మికులకు మొండి చేయి చూపారని కార్మికులు వేతనాలకు ప్రస్తావన లేదని. ఐసిడిఎస్ కి నిధులు పెంచలేదని, ప్రభుత్వ పథకాలలో కోత పెట్టడం వలన కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని. మరోవైపు పెట్టుబడిదారులకు, సంపన్న వర్గాలకు రాయితీలు ఇచ్చారని. వ్యవసాయం, గ్రామీణ ఉపాధి ఈ బడ్జెట్ వల్ల దెబ్బతింటుందని. కార్పొరేట్ కంపెనీలు లాభాల కోసం సంవత్సరాల తరబడి రాయితీలు ప్రకటించారని.ఇది పూర్తిగా కార్పొరేట్ బడ్జెట్ తప్ప, ప్రజా సంక్షేమం విస్మరించిన బడ్జెట్ అని కావున ఈ బడ్జెట్ ని ప్రజలందరూ వ్యతిరేకించాలని గని శెట్టి పిలుపునిచ్చారు.అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరసన తెలియజేసి బడ్జెట్ ప్రతులను దగ్ధం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిహెచ్ దేవి, కే రమణి, సుజాత, అరుణ, పార్వతి, వర వెంకటి, ఆర్. వి, తదితరులు పాల్గొన్నారు.

## ఎటువంటి భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వకూడదు

**జయభేరి, కీసర :**

GHMC కీసర సర్కిల్ పరిధిలోని దేవరయాంజాల్, మందాయపల & పోతాయపల్లి ప్రాంతాలకు చెందిన భూములలో సుచిరిండియ, వాసవి గ్రూప్ వాళ్ళు 79 సర్వే నంబర్ల లలో 81 ఎకరాలలో చేసిన లేఅవుట్ లో వివిధ రైతుల పేర్లపై రెవెన్యూ రికార్డులో వ్యవసాయ భూములుగా వున్నప్పటికి HMDA లోని డైరెక్టర్ ప్లానింగ్ విద్యదర్, పిఓ యశ్వంత్ రావు 5 కోట్లు ముడుపులు తీసుకొని లేఅవుట్ యొక్క డాక్యుమెంట్లు ఏమీ పరిశీలించకుండ లేఅవుట్ అనుమతులు మంజూరు చేసింది. ఈ లేఔట్ లోని వివిధ రైతుల పేర్లపై ఉన్న వ్యవసాయ భూమిని లోకల్ బాడీ వారికి వివిధ స్థలాలకోసం (పార్క్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఓపెన్ స్పేస్ & రోడ్లు) రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. దానితోపాటుగ ప్రజలను మోసం చెసి ప్లాట్లుగా సబ్ రిజిస్టర్, రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. ఈ భూమిలో కొంత మంది రైతులు పొజిషన్ లో వున్నారు. ఈ భూమిని అటు తహసిల్దార్ వ్యవసాయ భూములుగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ఈ డబల్ రిజిస్ట్రేషన్లు జరుగుతున్న విషయం GHMC కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఫిర్యాదు చెయ్యగా ACP మాకు



సంబంధం లేదని డిప్యూటీ కమిషనర్ ముందే చెప్పారు. కవిషనర్ ఈ విషయం పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. అంతేకాకుండా ఈ లేఔట్ కు ఇరిగేషన్ శాఖ వారు ఇచ్చినటువంటి ఎన్వోసీలు రద్దు చేయడం జరిగింది. ఈ లేఅవుట్ లో ఎటువంటి భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వకూడదు అన్ని లేఖ ద్వారా తెలియజేశారు. హైడ్ర కమిషనర్ ఈ లేఅవుట్ను ఇన్స్పెక్షన్ చేయడం జరిగింది. ఈ లేఅవుట్ లో ఓపెన్ స్పేస్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పార్క్ స్థలాలు, చెరువు నాలాలు 7 విలేజ్ మ్యాప్ & టోపోసిట్లో ఉన్నవి. కబ్జా, గుండ్ల కుంట లేక్ ఐడి 1839 యొక్క ఎఫ్టిఎల్ బఫర్ జోన్ లో రోడ్లు ప్లాట్లు చేయడంతో పాటు ఎటువంటి అనుమతులు లేకుండా క్లబ్ హౌస్ నిర్మించడం జరిగినందుని, వీటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి ఇవి సరి చెయుటకు, నాలాలు పునరుద్ధరణ చేయాలని లేఅవుట్ యాజమాన్యానికి తెలియజేయడం జరిగింది. కాని లేఅవుట్ యాజమాన్యం పట్టించుకోవడం లేదు GHMC కమిషనర్ ఈ లేఅవుట్ను ఇన్స్పెక్షన్ చెసి ఈ లేఔట్ లో ఎటువంటి భవన నిర్మాణానికి అనుమతి ఇవ్వకూడదని మరి ఈ లేఔట్ లో ఎటువంటి రిజిస్ట్రేషన్లు జరగకుండా చూడాలని, ఈ లేఔట్ అనుమతులు రద్దు చెసే విదంగా చర్యలు తీసుకొని ప్రజలకు, ప్రభుత్వానికి నష్టం జరగకుండా చూడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



# నెల రోజుల పాటు.. చక్కెర తినడం మానేసి చూడు

హైదరాబాద్ ఫిబ్రవరి 3 :

**మనం తీసుకునే ఆహారంలో చక్కెర ఒక భాగమైనదని చెప్పవచ్చు. ఉదయం నిద్రలేచింది మొదలు సాయంత్రం నిద్రించే వరకు ఏదో ఒక రూపంలో చక్కెరను తీసుకుంటూనే ఉంటాం. టీ, కాఫీ, జ్యూస్, స్వీట్స్, కుక్కీస్ ఇలా ఏదో ఒక రూపంలో చక్కెర మన శరీరంలోకి వెళ్తూనే ఉంటుంది. అయితే చక్కెరను తీసుకోవడం 30 రోజుల పాటు మానేయడం వల్ల మనం అనేక శారీరక, మానసిక మార్పులను గమనించవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే చక్కెరను మానేసిన తరువాత మొదట్లో మనం కొన్ని ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెరను తీసుకోవడం మానేసిన తరువాత చిరాకు, అలసట, ఆందోళన వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. మెదడు చక్కెర అందించే డోపమైన్ హిట్ ను కోల్పోవడం వల్ల ఇలా జరుగుతుంది. చక్కెర తీసుకోవాలనే కోరిక ఎక్కువగా ఉంటుంది. శరీరం నెమ్మదిగా చక్కెరకు దూరం అయ్యే కొద్దీ ఈ కోరికలు తగ్గుతూ వస్తాయి.**

### కొవ్వు కరుగుతుంది..

డిటాక్స్ ట్రెండ్ కంటే ఎక్కువగా చక్కెరను తీసుకోకపోవడం వల్ల మన శరీరానికి కలిగే మేలే ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇలా చక్కెరను తీసుకోవడం తగ్గించడం వల్ల క్రమంగా రెండవ వారం నాటికి రక్తంలో చక్కెర స్థాయిలు తగ్గుతాయి. ఇన్సులిన్ సెన్సిటివిటీ మెరుగుపడుతుంది. రక్తంలో గ్లూకోజ్ మరింత సమర్థవంతంగా నిర్వహించబడుతుంది. ఇన్సులిన్ స్థాయిలు తగ్గడంతో శరీరం నిల్వ ఉన్న కొవ్వును కరిగించడం ప్రారంభిస్తుంది. తద్వారా శరీర బరువు తగ్గుతుంది. ఇక మూడవ వారం కూడా చక్కెరను తీసుకోవడం మానేయడం వల్ల మనం దీర్ఘకాలిక ప్రయోజనాలనుగమనించవచ్చు. చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. దద్దుర్లు, మంట, మొటిమలు, పగుళ్లు వంటివి తగ్గుతాయి. అకాల వృద్ధాప్యం రాకుండా ఉంటుంది. రక్తంలో చక్కెర క్రాష్ లు తగ్గడం వల్ల మనం మరింత స్థిరంగా దృష్టి కేంద్రీకరించవచ్చు.

### కొలెస్ట్రాల్ అదుపులో..

క్యాలరీలు తీసుకోవడం తగ్గడం వల్ల శరీర బరువు తగ్గడాన్ని మనం ఎక్కువగా గమనించవచ్చు. అంతేకాకుండా అధిక కొలెస్ట్రాల్, ఫ్యాటీ లివర్ వంటి కాలేయ వ్యాధులు, అధిక రక్తపోటు, మధుమేహం వంటి ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుందని వైద్యులు తెలియజేస్తున్నారు. ఇక చక్కెర ఉండే స్వీట్లు, పానీయాలు, బేక్ చేసిన వస్తువులు తీసుకోవడం తగ్గించడం వల్ల ప్రజలు పండ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడానికి మొగ్గు చూపుతారు. దీంతో శరీరానికి కావల్సిన పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయి. చక్కెర కలిగిన ఆహార పదార్థాలకు బదులుగా నానబెట్టిన ఖర్జూరాలు, పెరుగు వంటి వాటిని తీసుకోవడం వల్ల బరువు అదుపులో ఉంటుంది. పేగు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

### ఉత్సాహంగా మారుతారు..

అంతేకాకుండా చక్కెరలో వచ్చే హెచ్చుతగ్గులు బద్దకం, చిరాకుకు కారణమవుతాయి. కనుక చక్కెరను మానేయడం వల్ల మనం ఉత్సాహంగా ఉండడంతో పాటు మానసికంగా ఉత్సాహంగా ఉండవచ్చు. ఇలా నెలరోజుల పాటు చక్కెర తీసుకోవడం మానేయడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్యులు చెబుతున్నారు. చక్కెర మానేయడం తాత్కాలికంగానే కాకుండా స్థిరమైన జీవనశైలి ఎంపికగాఉండాలని వారు సూచిస్తున్నారు. చక్కెరకు బదులుగా బెల్లం, తేనె, ఖర్జూరం వంటి వాటిని మితంగా తీసుకోవాలి. అలాగే తీపి వంటకాల తయారీలో చక్కెరకు బదులుగా యాలకులు, దాల్చిన చెక్క వంటి వాటిని వాడడం వల్ల తీపి తింటున్నామన్న అనుభూతి పెరుగుతుందని వైద్యులు సూచిస్తున్నారు.



# జంక్ ఫుడ్ మానేస్తే.. మీ ముఖంలో కనిపించే మార్పులు

**జంక్ ఫుడ్ ఆరోగ్యానికి మంచిది కాదని అందరికీ తెలుసు. అయినా సరే చాలామంది ఆ ఫుడ్ నే ఇష్టంగా తింటుంటారు. కానీ జంక్ ఫుడ్ ని ఒక 30 రోజులు మానేస్తే మీ శరీరంలో ఎన్ని మార్పులు జరుగుతాయో తెలుసా? ముఖ్యంగా ఫేస్ లో కనిపించే ఈ మార్పులు చూస్తే షాక్ అవుతారు.**

### 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే..

మనలో చాలామంది ఫాస్ట్ ఫుడ్, ప్యాకేజ్డ్ స్నాక్స్, కేక్‌లు, చిప్స్ వంటి పదార్థాలను ఇష్టంగా తింటుంటారు. కానీ అవి మన శరీరం, ముఖ్యంగా చర్మంపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయో తెలుసా? ఆరోగ్య నిపుణులు, స్కిన్ కేర్ ఎక్స్‌పర్ట్‌ల ప్రకారం కేవలం 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా ముఖంలో కలిగే మార్పులేంటో ఇక్కడ తెలుసుకుందాం.

### మృదువుగా మారుతుంది

జంక్ ఫుడ్ ఎక్కువగా సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, షుగర్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది చర్మంలో ఇన్ఫ్లమేషన్ ను పెంచుతుంది. ముడతలు, ఎరుపు, పొడిబారడం వంటి సమస్యలకు కారణమవుతుంది. జంక్ ఫుడ్ మానేసిన వెంటనే, శరీరంలోని ఇన్ఫ్లమేటరీ రియాక్షన్స్ తగ్గుతాయి. 30 రోజుల్లో చర్మం సహజంగా హైడ్రేటెడ్ గా, మృదువుగా మారుతుంది. ముఖ్యంగా కేకులు, కోల్డ్ డ్రింక్స్, చిప్స్ మానడం వల్ల చర్మం.. లోపలి తేమను నిలుపుకోవడానికి అవకాశం ఉంటుంది.

### కొల్లాజెన్ ఉత్పత్తిపై ప్రభావం

షుగర్ అధికంగా తీసుకోవడం వల్ల చర్మంలోని కొల్లాజెన్ దెబ్బతింటుంది. కొల్లాజెన్ శక్తిని కోల్పోవడం వల్ల చర్మంపై ముడతలు మొదలవుతాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేయడం ద్వారా, కొల్లాజెన్ ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దానివల్ల చర్మం స్థిరంగా ఉంటుంది, ముడతలు తగ్గుతాయి. కాంతివంతంగా మారుతుంది.

### ముఖం స్లిమ్ గా కనిపించడం

జంక్ ఫుడ్ ఎక్కువగా సోడియం, ఫ్యాట్, ప్రాసెస్డ్ పదార్థాలను కలిగి ఉంటుంది. ఇది శరీరంలో వాటర్ రిటెన్షన్, మలినాలు, ఫేస్ బ్లోటింగ్ కు కారణమవుతుంది. ఆరోగ్య నిపుణుల ప్రకారం, 30 రోజులు జంక్ ఫుడ్ మానేసి.. సరైన ఆహారం తీసుకోవడం ద్వారా ఫేస్ బ్లోటింగ్ తగ్గి ముఖం స్లిమ్ గా కనిపిస్తుంది. అలాగే, యాంటీ ఆక్సిడెంట్‌లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల చర్మం లోపలి నుంచి మెరుగుపడుతుంది.

### ముఖం ఫ్రెష్ గా..

జంక్ ఫుడ్ లోని ఫ్యాటీ, ప్రాసెస్డ్ పదార్థాలు శరీరంలోని యాంటీఆక్సిడెంట్ స్థాయిలను తగ్గిస్తాయి. చర్మం యూవీ కిరణాల ప్రభావానికి లోనవుతుంది. జంక్ ఫుడ్ మానేసి.. ఇతర ఫ్రూట్స్, వెజిటబుల్స్ తీసుకుంటే వాటిలోని యాంటీ ఆక్సిడెంట్‌లు చర్మ రికవరీని వేగవంతం చేస్తాయి. సన్ డ్యామేజ్ తగ్గి, చర్మం తాజాగా మారుతుంది.

### ఆత్మవిశ్వాసం పెరుగుతుంది

చర్మంలో కనిపించే ఈ మార్పులు మానసికంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. 30 రోజులు జంక్ ఫుడ్ మానేస్తే.. ముఖం స్పష్టంగా మెరుస్తుంది, చర్మం ఆరోగ్యంగా కనిపిస్తుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. జంక్ ఫుడ్ మానేయడం ఒక్క చర్మ ఆరోగ్యానికే కాదు.. మొత్తం శరీర ఆరోగ్యానికి మేలు చేస్తుంది.



# జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి?

**జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరగడానికి మనం తలకు నూనె రాస్తుంటాం. తలపై నూనెతో స్మూత్ గా మసాజ్ చేస్తే ప్రశాంతంగా అనిపిస్తుంది. జుట్టు కుదుళ్లు కూడా బలపడతాయి. జుట్టు చక్కగా పెరగాలంటే ఎన్ని రోజులకు ఒకసారి నూనె రాయాలి? నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా?**

మనం జుట్టుకు రెగ్యులర్ గా నూనె రాస్తుంటాం. దానివల్ల జుట్టు ఒత్తుగా, ఆరోగ్యంగా పెరుగుతుంది. కానీ జుట్టుకు ఎన్ని రోజులకు ఒకసారి ఆయిల్ రాయాలి? రోజూ రాయడం మంచిదా? లేక వారంలో ఒకటిరెండు సార్లు రాస్తే సరిపోతుందా? నిపుణులు ఏం చెబుతున్నారో ఇక్కడ వివరంగా తెలుసుకుందాం.

### వారానికి 1-2 సార్లు

ఆరోగ్య నిపుణుల ప్రకారం జుట్టుకు వారానికి 1-2 సార్లు ఆయిల్ రాయడం మంచిది. సాధారణ లేదా డ్రై హెయిర్ ఉన్నవారు వారానికి రెండు సార్లు రాసుకోవచ్చు. ఆయిలీ స్కాల్ప్ ఉన్నవారు వారానికి ఒకసారి జుట్టుకు నూనె రాస్తే సరిపోతుంది. దానివల్ల స్కాల్ప్ ఉత్పత్తి చేసే సహజ నూనెలపై చెడు ప్రభావం పడదు.

### రోజూ రాస్తే ఏమవుతుంది?

సాధారణంగా చాలామంది రోజూ నూనె రాసుకుంటే జుట్టు బాగా పెరుగుతుందని అనుకుంటారు. కానీ దానివల్ల హెయిర్ ఫోలికల్స్ బలహీనపడే అవకాశం ఉంది. అంతేకాదు దుమ్ము, ధూళి వంటివి తలపై చేరి చర్మ రంధ్రాలు మూసుకుపోతాయి. ఫలితంగా చుండ్రు, ఇరిటేషన్, హెయిర్ ఫాల్ వంటి సమస్యలు ఎదురవుతాయి.

### నూనె వేడి చేసి రాస్తే..

ఆయిల్ వాడటం వల్ల జుట్టుకు హైడ్రేషన్ లభిస్తుంది. తలపై స్మూత్ గా మసాజ్ చేయడం వల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. అయితే చాలామంది నూనెను కొద్దిగా వేడి చేసి జుట్టుకు అప్లై చేస్తుంటారు. గోరువెచ్చని నూనెతో తలపై మసాజ్ చేస్తే.. జుట్టులోకి సులభంగా ఇమిడిపోతుంది. అలాగే రక్తప్రసరణ మెరగవుతుంది. కానీ నూనెను ఎక్కువ వేడి చేయడం మంచిది కాదు. అదే విధంగా జుట్టుపై బలంగా రుద్దడం కూడా ప్రమాదకరం అని నిపుణులు సూచిస్తున్నారు.

### ఎక్కువసేపు ఉంచితే?

జుట్టుకు నూనె రాసిన తర్వాత మరీ ఎక్కువసేపు ఉంచకూడదు. 45 నిమిషాల నుంచి 2 గంటల వరకు ఉంచితే సరిపోతుంది. దానికంటే ఎక్కువసేపు ఉంచితే.. ప్రయోజనాల కంటే నష్టాలే ఎక్కువని నిపుణులు చెబుతున్నారు. ఫంగల్ ఇన్ఫెక్షన్లు, చుండ్రు, జుట్టు రాలడం వంటి సమస్యలు ఎదురవుతాయని సూచిస్తున్నారు.

### ఏ నూనె వాడొచ్చు?

నిపుణుల ప్రకారం జుట్టు రకాన్ని బట్టి నూనెను ఎంచుకోవాలి. పొడి జుట్టుకు కొబ్బరి నూనె వాడొచ్చు. కొబ్బరినూనె జుట్టు లోపలి వరకు చొచ్చుకుపోయే గుణాలను కలిగి ఉంటుంది. అలాగే మందపాటి జుట్టుకు బాదం నూనె, జుట్టు పెరుగుదలకు ఆముదం నూనె వంటివి వాడొచ్చు.





# బ్లైండ్ పాత్ర చేయబోతున్నట్టు లీక్ చేసిన ఆనంద్ దేవరకొండ..

యంగ్ హీరో ఆనంద్ దేవరకొండ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం టవర్‌లో ఎపిక్, తక్షకుడు వంటి ప్రాజెక్టులతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్న ఆయన, తాజాగా శ్రీ చిదంబరం గారు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తాను చేస్తున్న కొత్త సినిమా పాత్ర గురించి చెప్పిన విషయాలు అభిమానుల్లో ఆసక్తి రేకెత్తించాయి. శ్రీ చిదంబరం గారు చిత్రం మెల్లకన్ను సమస్యతో బాధపడే యువకుడి జీవితాన్ని ఆధారంగా తీసుకుని తెరకెక్కిన కథగా దర్శకుడు రూపొందించినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో హీరోగా నటించిన వంశీ తన తొలి చిత్రంలోనే ఇలాంటి సవాలుతో కూడిన పాత్రను ఎంచుకోవడం సినీ వర్గాల్లో ప్రశంసలు అందుకుంటోంది. ఈ విషయాన్ని ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఆనంద్ దేవర కొండ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈవెంట్‌లో మాట్లాడుతూ ఆనంద్ దేవరకొండ, "మూడు నెలల క్రితమే ఈ సినిమా టీజర్ చూశాను. చాలా బ్యూటిఫుల్‌గా అనిపించింది. వంశీ ఈ పాత్రను ఎలా పోషించాడో నిజంగా ఆశ్చర్యం వేసింది. నా రాబోయే సినిమా తక్షకుడులో నేను బ్లైండ్ క్యారెక్టర్ చేస్తున్నాను. రెండు రోజులు షూట్ చేసిన తర్వాతే నాకు తలనొప్పి మొదలైంది. నేను అసలు మెల్లకన్ను పెట్టకపోయినా, ఎవరికీ ఐ కాంటాక్ట్ ఇవ్వకుండా నటించడమే కష్టం అనిపించింది" అని చెప్పుకొచ్చారు. మీ సినిమా టీజర్, ట్రైలర్ చూస్తుంటే లఅందులో మీ పర్ఫార్మెన్స్ స్పష్టంగా కనిపిస్తోంది. ఫస్ట్ సినిమాకే ఇలాంటి పాత్ర చేయడం చాలా కష్టం. మీరు నిజంగా గర్వపడాల్సిన విషయం ఇది" అంటూ వంశీని అభినందించారు. ఆనంద్ వ్యాఖ్యలు అక్కడున్న ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే తక్షకుడు సినిమాలో బ్లైండ్ పాత్ర కోసం ఆయన పడుతున్న కష్టాలపై అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. షూటింగ్ ప్రారంభ దశలోనే ఇంత కష్టం అనిపిస్తే సినిమా పూర్తయ్యే సరికి ఎంత శ్రమ పడతాడో అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. మరోవైపు శ్రీ చిదంబరం గారు సినిమాలో వంశీ నటనపై ప్రశంసల వర్షం కురుస్తోంది. తొలి చిత్రంతోనే విభిన్నమైన పాత్రను ఎంచుకోవడం అతనికి మంచి గుర్తింపును తీసుకురావొచ్చని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఓ అభిమానిగా ఎదురుచూస్తున్నా!



రాజమౌళి ఇప్పటివరకు చేసిన చిత్రాలన్నింటిలో 'వారణాసి' భిన్నంగా ఉంటుందని, సాహస ఘట్టాలు..పురాణాలు.. టైమ్ ట్రావెల్ వంటి అంశాలతో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందిస్తుందని అగ్ర హీరో మహేష్‌బాబు చెప్పారు. ఆయన కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ వరల్డ్ యాక్షన్ అడ్వెంచర్ 'వారణాసి' ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం తాజా ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విశేషాలను పంచుకుంది. 15 ఏళ్ల క్రితమే తాను రాజమౌళి దర్శకత్వంలో సినిమా చేయాల్సి ఉందని, ఇప్పటికి అది కార్యరూపం దాల్చిందని మహేష్‌బాబు చెప్పారు. తాను కూడా రాజమౌళి అభిమానిగా ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్నానని ఆయన అన్నారు. 'ఈ సినిమాలో నేను రాముడి పాత్రలో కనిపిస్తాను. పాత్రలో పరిపూర్ణత కోసం ఎన్నో కసరత్తులు చేశాం. నేను పరుగెత్తే విధానాన్ని కూడా రాజమౌళి మార్చారు. దాని కోసం ఆరు నెలలు ప్రాక్టీస్ చేశాను. కేవలం రెండు షాట్స్ కోసం టీమ్ అంతా మూడునాలుగు నెలలు శ్రమించాం. దీన్ని బట్టి సినిమా కోసం రాజమౌళి ఎంతగా తపిస్తారో అర్థం చేసుకోవచ్చు' అని మహేష్‌బాబు అన్నారు. తొలుత ఈ సినిమాలో హీరోగా నటించడానికి భయపడ్డానని, అయితే రాజమౌళి కథను వివరించిన తీరు తనలోని భయాన్ని పోగొట్టిందని మహేష్‌బాబు పేర్కొన్నారు.

# ఇప్పుడు టాలీవుడ్ ఫేమస్ హీరోయిన్..



ఆమె ఇప్పుడు టాలీవుడ్ ఫేమస్ హీరోయిన్. ప్రజెంట్ ఈ బ్యూటీ పేరు తెగ వినిపిస్తోంది. ఎందుకంటే ఆమె మెయిన్ లీడ్ చేసిన ఒక సినిమా ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా యావరేజ్ గా నిలిచినా ఈ ముద్దుగుమ్మ అభినయంపై మాత్రం తెగ ప్రశంసల వర్షం కురుస్తోంది. సినిమాలో హీరో కన్నా ఈమెనే హైలెట్ గా నిలిచిందని రివ్యూలు, సినిమా విశ్లేషకులు మెచ్చుకుంటున్నారు. ఈ ముద్దుగుమ్మ చదువుకునే వయసులోనే మోడలింగ్ స్టార్ట్ చేసింది. ఎంబీఏ మధ్యలోనే వదిలిపెట్టి మోడల్ గా అదృష్టం పరీక్షించుకుంది. అలా ఫీల్ గుడ్ డైరెక్టర్ శేఖర్ కమ్ముల ఈ బ్యూటీని చూసి తన లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ మూవీలో ఒక చిన్న రోల్ ఇచ్చారు. దీని తర్వాత ఏకంగా హీరోయిన్ ఛాన్స్ కొట్టేసిందీ అందాల తార. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ అందుకుంది. ఆ తర్వాత కూడా పలు సినిమాల్లోనూ కథానాయికగా చేసింది. ఈ హీరోయిన్ కు అందం, అభినయం రెండూ ఉన్నాయి. కానీ ఎందుకోగానీ స్టార్ హీరోయిన్ స్టేటస్ ను అందుకోలేకపోయింది. అందుకే కొన్ని సినిమాల్లో సెకెండ్ హీరోయిన్ రోల్స్ కూడా చేసింది. అయితే చాలా గ్యాప్ తర్వాత ఓ మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిందీ అందాల తార. దీంతో ఇప్పుడు మరోసారి ఈ హీరోయిన్ నెట్టింట బాగా ట్రెండ్ అవుతోంది. మరి ఇంతకీ ఈ క్యూటీని గుర్తు పట్టారా? ఆమె మరెవరో కాదు 'ఓం శాంతి శాంతి శాంతిః' మూవీ హీరోయిన్ ఈషా రెబ్బా తరుణ్ భాస్కర్ హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ సినిమా 'ఓం శాంతి శాంతి శాంతిః'. ఏ ఆర్ సజీవ్ తెరకెక్కించిన ఈ సినిమాలో ఈషా రెబ్బా హీరోయిన్ గా నటించింది. మలయాళం బ్లాక్ బస్టర్ మూవీ జయ జయ జయ జయహే కు ఇది రీమేక్. గత వారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ఓం శాంతి శాంతి శాంతిః' సినిమాకు పాజిటివ్ టాక్ వచ్చింది. ముఖ్యంగా ఈషా నటన పట్ల సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. కాగా ఈ సినిమా కంటే ముందు ఆమె 2023లో మామా మశ్చీంద్ర అనే సినిమాలో హీరోయిన్ గా చేసింది. అలాగే కొన్ని తమిళ, మలయాళ సినిమాల్లోనూ చేసింది.



# ఆ హీరోలంటే నాకు పిచ్చి..

ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. తెలుగులో సాఫ్ట్‌వేరు సుధీర్, నేను శైలజ, రాజు గారి గది, కార్బన్ వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అటు వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ రాణిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది ఈ చిన్నది. గతంలో ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో ముచ్చటించింది. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలు చెప్పిందీ బ్యూటీ. ఆ కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. సోషల్ మీడియా చాట్ లో ధన్య మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్, సూర్య, రణ్‌బీర్ కపూర్ తన క్రష్‌లని.. ఛాన్స్ దొరికితే వారితో నటించాలని ఉందని చెప్పుకొచ్చింది. ఇక ఓ సినిమాలో మద్యం తాగిన సన్నివేశం గురించి అభిమాని ప్రశ్నించగా.. కేవలం మందు తాగినట్లు చూపించారు. కానీ అది నిజం కాదు. నేను తాగింది కేవలం నీళ్లు మాత్రమేనని చెప్పుకొచ్చింది. ఇక ఈ చిన్నది కేవలం క్యారక్టర్ ఆర్టిస్ట్‌లకే పరిమితం కాకుండా.. హీరోయిన్‌గానూ పలు చిత్రాల్లో నటించింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ధన్య రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ అభిమానులను కవ్విస్తుంది. ఈ అమ్మడి ఫోటోలకు మంచి క్రేజ్ ఉంటుంది.

# చిరంజీవి ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. మన శంకర వర ప్రసాద్ గారు




టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్ పోషించిన చిత్రం మన శంకర వర ప్రసాద్ గారు.'పండగకు వస్తున్నారు'ట్యాగ్‌లైన్‌తో తెరకెక్కిన ఈ చిత్రాన్ని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేయగా.. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించింది. వెంకటేశ్ కీలక పాత్రలో నటించాడు. సంక్రాంతి కానుకగా జనవరి 12న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డ్ వసూళ్లతో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచింది. థియేటర్లలో మిస్సయి ఓటీటీలో ఎప్పుడొస్తుందా..? అని ఎదురుచూస్తున్న వారి కోసం అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. ఫైనల్‌గా మనశంకర వర ప్రసాద్ గారు పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5లో ప్రీమియర్ కానుంది. ఫిబ్రవరి 11 నుంచి తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడతోపాటు మరాఠి, బంగ్లా భాషల్లో కూడా స్ట్రీమింగ్ కానుంది. మరి ఓటీటీలో ఈ మూవీ ఎలాంటి రెస్పాన్స్ రాబట్టుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ మూవీలో వీటీవీ గణేశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్ధన్, రేవంత్ భీమల (సంక్రాంతికి వస్తున్నాం ఫేం బుల్లిరాజు) కీలక పాత్రల్లో నటించారు. చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెలవిష్ణు ప్రసాద్ హోం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కించిన ఈ మూవీకి భీమ్స్ సిసిరోలియో మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించాడు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**